
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 20 ఫిబ్రవరి 2025 | 5





ఏ వెండి.. పెరుగుతుందండీ!

- రూ.లక్షకు చేరువలో వెండి ధరలు
- కిలో రూ.99,800.. బంగారం పైపైకే

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

వెండి ధరలు బంగారంతో పోటీ పడుతున్నాయి. ఇవాళ్టికిలో వెండి ధర రూ.లక్షకు చేరువగా ఉంది. ప్రస్తుతం కేజీ వెండి ధర రూ.99,800గా ఉంది. బంగారం ధర పది గ్రాముల 22 క్యారెట్ ధర 80,350 అయింది. ఇంకా ఈ ధరలు పెరిగే అవకాశాలున్నట్టు మార్కెట్ అంచనా. బంగారం, వెండి ఆభరణాలంటే మహిళలకు ఎంతో మోజు. పురుషులూ ఈమధ్య వీటిపై మోజు పెంచుకుంటున్నారు. సాధారణంగా వెండి కంటే బంగారం ధరించడానికి స్త్రీ, పురుషులు ఇష్టపడతారు. వెండితో సాధారణంగా ప్లేటులు, గ్లాసులు వంటి వస్తువులను ఇంటిలోకి ఉపయోగిస్తారు. పూజా సామగ్రి కూడా వెండివే వినియోగిస్తారు. ఇటీవల పెట్టుబడి కింద కూడా వెండిని ఉపయోగిస్తున్నారు. వెండిబారులు ఎక్కువ మంది కొనుగోలు చేస్తున్నారు. ఇవి 50 గ్రాముల బారు నుంచి కిలో బారు వరకూ ఉంటుంది. ఇవికాకుండా గోల్డ్ కోటెడ్ వెండి ఆభరణాలకు ధరించే ట్రెండ్ నడుస్తోంది. వెండి పట్టీలు ఎలాగూ ప్రతీ మహిళా ధరిస్తారు. బంగారం ధరలు పెరగడం, చోరీల నుంచి రక్షణ పొందేందుకు ఇలా వెండి నగలను ధరిస్తున్నారు. ఈ నేపథ్యంలో బంగారం ధరతోపాటు వెండి ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులూ వెండి ధరలను ప్రభావితం చేస్తున్నాయి. కొంతకాలంగా బంగారం ధరలు విపరీతంగా పెరుగుతున్న సంగతి తెలిసిందే. బంగారంతోపాటు వెండి ధరలు కూడా పోటీపడుతుండడం విశేషం. గతవారంలో కిలో వెండి ధర రూ.99,900 పలికింది. తర్వాత రూ.200 తగ్గి కిలో రూ.99,700గా కొనసాగింది. బుధవారం మళ్లీ పెరిగిపోయి 99,800 అయింది. ఇది ఇంకా తగ్గుతుందా, పెరుగుతుందా అనే అంచనా వేయలేని పరిస్థితి ఉంది. అయితే కిలో వెండి రూ.లక్ష ధర పలికే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. వినియోగదారులు ప్రస్తుతం వెండి కొనుగోలు చేద్దామంటే ధర ఎక్కువ ఉంది. తర్వాత కొనుగోలు చేయవచ్చని వాయిదా వేద్దామంటే మరింత పెరిగిపోతుందేమోననే ఆందోళన ప్రజల్లో ఉంది. జనవరి ఒకటిన కిలో వెండి ధర రూ.88,400 ఉంది. నెలా పదిహేను రోజుల తర్వాత అంటే ఇవాళ కిలో ధర రూ.99,800లకు చేరింది. బుధవారం నాడు బంగారం 22 క్యారెట్ పది గ్రాముల ధర 80,350, 24 క్యారెట్ బంగారం ధర రూ.87,650 ఉంది.

చిదిమేస్తున్నారు!

మోసగాళ్ల చెరలో మైనర్లు





మాయమాటలో, విష సంస్కృతో అభంశుభం తెలియని బాలికలను విష వలయంలోకి నెట్టేస్తోంది. ఆ వలయంలో చిక్కిన వారి జీవితాలు అగాధంలో పడిపోతున్నాయి. తర్వాత లేచి చూస్తే.. అంతా చీకటే. ఎంతో భవిష్యత్తును చూడాల్సిన మైనర్లు జీవచ్ఛవాలుగా మిగిలిపోతున్నారు. మైనర్లపై ఇటీవల అత్యాచారాలు జరుగుతున్న ఉదంతాలెన్నో నమోదవుతున్నాయి. ఈవారం పది రోజుల్లోనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో అనేక ఘటనలు పోలీసు కేసులయ్యాయి. కేసుల దాకా రానివీ మరెన్నో ఉంటాయి. వీరికి న్యాయం జరుగుతుందా, నిందితులకు శిక్ష పడుతుందా.. ఇంతవరకే మనం ఆలోచించగలం. కానీ అఘాయిత్యానికి గురైన మైనర్లు, మహిళల భవిష్యత్తు మాత్రం గాఢాంధకారమే. పోలీసులు కఠినంగా వ్యవహరిస్తే కొంతవరకైనా కట్టడి అయ్యే అవకాశం ఉంటుంది.

- బాలికలకు భద్రత కరవు
- పోక్సో కేసులే దానికి రుజువు
- రోజురోజుకూ మహిళలపై పెరుగుతున్న అఘాయిత్యాలు
- ప్రేమ పేరుతో వలలో చిక్కుతున్న యువతులు
- స్మార్ట్ ఫోన్ల బంధాలతోనూ వాటిల్లుతున్న పెనుముప్పు
- జిల్లాల్లో పెరిగిపోతున్న మిస్సింగ్ కేసులు

(రాజమహేంద్రవరం/సామర్లకోట/మండపేట/ముమ్మిడివరం/మలికిపురం- ఆంధ్రజ్యోతి)

బాలికలకు, మహిళలకు భద్రత కరువైంది. ప్రధానంగా ప్రేమపేరుతో బాలికలు, యువతులు మోసగాళ్ల చెరలో చిక్కుతున్నారు. దీంతో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో మిస్సింగ్ కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నాయి. దీనికి కుటుంబ పరిస్థితులు, గృహహింస, తల్లిదండ్రుల సంబంధాలు, తల్లి లేదా తండ్రి ఒక్కరే ఉండడంతో ఒంటరితనం, మద్యం వంటి వాటికి బానిస కావడం, పిల్లలపై సరైన పర్యవేక్షణ లేకపోవడం, సామాజిక మాధ్యమాల ప్రభావం, ఆకర్షణలకు గురికావడం ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయని కిర్లంపూడి పీహెచ్‌సీలో వైద్యునిగా పనిచేస్తున్న డాక్టర్ ప్రసాద్ చెప్పారు. నిజమే, ప్రధానంగా స్మార్ట్‌ఫోన్ల వల్ల ఆడ, మగ తేడా లేకుండా జీవితాలు పట్టు తప్పుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. అత్యాచారం, అదృశ్యం కేసుల్లో లోతుల పరిశీలన చేస్తే చివరికి సెల్‌ఫోన్ కారణమని తేలుతోంది. కలిసి చదువుకుంటున్నాం.. కలిసి తిరిగేస్తే తప్పేంటనే తొందరపాటే అమ్మాయిల జీవితాలను ప్రశ్నల కూపంలోకి నెట్టేస్తోంది. ప్రేమ.. ఆకర్షణ.. అవసరం.. వాంఛ.. వీటి మధ్య ఉన్న సున్నితమైన గీతను గుర్తించడంలో విఫలమవుతున్న అమ్మాయిలు అమాయకంగా తమంతట తాముగా వెళ్లి జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు.

ఇవి కొన్నే...

మాయ మాటలతో వ్యభిచారంలోకి

అనకాపల్లి జిల్లాకు చెందిన 17ఏళ్ల బాలికను కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన చందు ప్రేమపేరిట మాయమాటలు చెప్పి గతేడాది చివరల్లో ఇక్కడకు తీసుకువచ్చాడు. ఆ తర్వాత తన ప్రణాళిక ప్రకారం బాలికను వ్యభిచారంలోకి దింపేందుకు తన తల్లిని వినియోగించాడు. ఈ కూపంలో ఆ బాలికకు ఇన్ఫెక్షన్ సోకడంతో వైద్యం చేయించారు. బాధలతోపాటు తల్లీకొడుకులు పెట్టే బాధలు భరించలేక గతేడాది చివర్లోనే ఆమె చీమలమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్సలో ఆ బాలిక ఆరోగ్యం మరింత క్షీణించింది. పోలీసులకు ఫిర్యాదు అందడంతో తీగలాగితే డొంక కదిలింది. పెద్దాపురం పోలీసులు రంగప్రవేశం చేసి బాలికను మోసగించి, వేధింపులకు పాల్పడిన తల్లీకొడుకులను అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం బాలిక ఆస్పత్రిలో అవసానదశలో చికిత్స పొందుతోంది. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

8వ తరగతి బాలికను చెరపట్టి...

ముమ్మిడివరం మండలం అనాతవరం గ్రామానికి చెందిన పరమట దుర్గాప్రసాద్ (30) ఎలియాస్ బులిచంటి 8వ తరగతి చదువుతున్న 15 ఏళ్ల బాలికపై కన్నేశాడు. గత సోమవారం ఆ బాలిక ఇంటి నుంచి పాఠశాలకు తోటి విద్యార్థినులతో కలిసి వెళ్లి స్కూలు వద్ద బస్సు దిగగా దుర్గాప్రసాద్ మోటారు సైకిల్‌పై వచ్చి ఆమెకు మాయ మాటలు చెప్పి బలవంతంగా మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని అమలాపురం ఎర్రవంతెన సమీపంలోని ఒక నివాస గృహంలోకి తీసుకువెళ్లి శారీరకంగా అనుభవించాడు. ఈ విషయం తెలిసిన ఆ బాలిక తండ్రి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో గాలింపు చర్యలు చేపట్టారు. పోలీసులు కేసు నమోదుచేసి ఆ బాలికను వైద్య పరీక్షలకు పంపించి నిందితుడిపై పోక్సో అత్యాచార కేసును నమోదుచేశారు.

ప్రేమ పేరిట వేధించి.. ఆత్మహత్యకు పురిగొల్పి..

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం మాధవపట్నంలో అనుసూరి విఘ్నేశ్ అనే యువకుడి వేధింపులకు తాళలేక మూడు రోజుల కిందట 17 ఏళ్ల బాలిక ఆత్మహత్యకు పాల్పడింది. గతంలో అతడు ఆ బాలికను ప్రేమపేరిట వేధించేవాడు. దీంతో ఆమె ఫిర్యాదు మేరకు సామర్లకోట పోలీసులు అప్పట్లో అతడిపై ఎస్సీ, ఎస్టీ, పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి అరెస్ట్ చేసి జైలుకు పంపారు. కొన్నాళ్లకు బెయిల్‌పై బయటకు వచ్చిన అతడు ఆ బాలిక వద్దకు వెళ్లి పెళ్లి చేసుకుంటానని తనపై పెట్టిన కేసును ఉపసంహరించుకోవాలని ఒత్తిడి చేశాడు. మాయమాటలకు లొంగిన ఆ బాలిక వివాహం చేసుకుంది. కొంతకాలం అదే గ్రామంలో ఇద్దరూ కాపురం పెట్టారు. ఇటీవల కాలంలో ఆమెపై వేధింపులు పెరిగాయి. రెండు రోజులుగా వారిద్దరి మధ్య ఘర్షణలు జరగ్గా ఆమెను శారీరకంగా వేధించాడని తెలిసింది. సోమవారం రాత్రి ఆమె అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. కేసు నమోదు చేసిన పోలీసులు విఘ్నేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

ఫొటోలు పంపి.. వేధించాడు...

రాజమహేంద్రవరం నగరానికి చెందిన ఓ అమ్మాయికి ఓ యువకుడు పదేపదే ఫోన్లు చేసి వేధిస్తున్నాడు. ఆమె ఎన్ని ఫోన్ నెంబర్లు మార్చినా ఫలితం లేకపోతోంది. చివరికి ఆమె తండ్రికి ఆమె పర్సనల్ ఫొటోలు పంపించాడు. అది చూసి ఆ తండ్రి గుండె పగిలినంత పనైంది. కూతురిని గట్టిగా నిలదీస్తే కథ బయటకు వచ్చింది. ఆ కుర్రాడు ఆ అమ్మాయితో చదువుకున్నవాడే. ఆ రోజుల్లో చనువుండేది. ఇప్పుడు ఆ అమ్మాయికి పెళ్లి నిశ్చయం కావడంతో ఆ అబ్బాయి తీరు విపరీతమైంది.

పెళ్లి చేసుకుంటానని లోబరుచుకుని..

మండపేట పట్టణంలోని గొల్లపుంత కాలనీకి చెందిన ఆటోడ్రైవర్ క్రాంతికుమార్ అదే పట్టణంలో పదవ తరగతి చదువుతున్న బాలికపై అత్యాచారం చేశాడు. ఇతడికి ఇంతకుముందే వివాహమై కుమారుడు కూడా ఉన్నారు. నిందితుడి ఇంటికి సమీపంలోనే ఆ బాలిక కుటుంబం ఉండడంతో పరిచయం పెంచుకుని అఘాయిత్యానికి పాల్పడ్డారు. పట్టణ పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాలికను పెళ్లి చేసుకుంటానని మాయమాటలతో లోబరుచుకున్నట్టు తేలింది.

సోషల్ మీడియా ఓ కత్తి..

సోషల్ మీడియా ఓ కత్తి వంటిది. దానితో మంచి చెడూ రెండూ ఉన్నాయి. అయితే చెడు మార్గంలోకి వెళ్లడానికి ఈరోజు యువత దానిని ఎక్కువగా వాడుతోంది. చెడు కంటెంట్ కూడా విపరీతమైన లభ్యత వల్ల బాలలు సైతం కొన్ని కేసుల్లో ఉండడం మనం చూస్తున్నాం. పిల్లల సెల్‌ఫోన్లను పెద్దలు గమనిస్తూ ఉండాలి. తల్లిదండ్రులు కూడా పిల్లలతో స్నేహభావంతో మెలుగుతూ అన్ని విషయాలనూ గమనిస్తూ, ఆరా తీస్తూ ఉండాలి. ఆదర్శనీయులు, మార్గదర్శకులు, నీతి కథలు, జీవితంపై చెడు చూపించే ప్రభావం, కుటుంబ విలువలు వంటి వాటిని నూరిపోస్తూ ఉంటే మంచిది.

- డాక్టర్ కర్రి రామారెడ్డి, ప్రముఖ మానసిక వైద్య నిపుణులు

ఆత్మరక్షణపై శిక్షణ ఉండాలి

అత్యాచారాలు, అఘాయిత్యాల నుంచి తప్పించుకునేందుకు అవగాహనతోపాటు ఆత్మరక్షణపై పాఠశాలల్లో శిక్షణ ఇవ్వాలి. ప్రతీ ఒక్కరు బాలికలకే జాగ్రత్తలు చెబుతారుతప్ప బాలురకు కౌన్సెలింగ్‌గానీ, శిక్షణగానీ ఇవ్వడం లేదు.. బాలికలతో బాలురు ఎలా మెలగాలనేది కూడా కుటుంబ స్థాయిలోనే పెంపకంలోనే అలవాటు చేయాలి. వీటికి తల్లే ముఖ్య బోధకురాలు కావాలి. బాల్య దశలోనే నీతి సూత్రాలు, మంచి కథలు వినిపించాలి.

- నల్లి సన్‌షైన్, కౌన్సెలింగ్ సైకాలజిస్ట్

కాంట్రాక్టు ఖరారు కాకుండానే..!

- కూనవరం మొగ వద్ద డ్రెడ్జింగ్ యంత్రం
- అతి ధీమాతో చక్రం తిప్పుతున్న ఓ కాంట్రాక్టరు
- సహకరిస్తున్న అధికారగణం
- మొగ పునరుద్ధరణ పనులు సజావుగా సాగేనా?



కూనవరం మొగ వద్ద ముందస్తుగానే డ్రెడ్జింగ్ యంత్రాన్ని సిద్ధం చేసిన ఓ కాంట్రాక్టరు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి):

టెండర్లు ఖరారు కాకుండానే ముందస్తుగానే యంత్ర పరికరాలను సైట్ వద్ద సిద్ధం చేసుకున్నారు అతి ధీమా కలిగిన ఒక కాంట్రాక్టరు. మితిమీరిన రాజకీయ నాయకుల జోక్యం, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిన ఓ అధికారి సహకారంతో కూనవరం స్ట్రెయిట్ కట్ పునరుద్ధరణ పనులు ఖరారు కాకుండానే డ్రెడ్జర్‌ను మొగ వద్ద సిద్ధం చేసుకున్నారని పలువురు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. టెండరు తనకే దక్కాలనే వ్యూహరచనకు ఇరిగేషన్ అధికారులు నిబంధనలకు నీళ్లొదిలి సంపూర్ణ సహకారం అందించారు. దాంతో మొగ వద్ద కొన్ని నెలల క్రితమే ఆ పనులు చేసేందుకు అవసరమైన యంత్ర పరికరాలను సిద్ధంచేశారు ఉప్పలగుప్తం మండలం కూనవరం స్ట్రెయిట్‌కట్ పనుల పునరుద్ధరణ కోసం రూ.3.16 కోట్ల అంచనా వ్యయంతో డ్రెడ్జింగ్ పనులు చేపట్టేందుకు అధికారులు నిబంధనలు విస్మరించి ఇటీవల రెండు పర్యాయాలు టెండర్లు పిలిచారు. ఈ వ్యవహారంపై ఈ నెల 17వ తేదీన 'కోట్ల పనులకు టెండరు పెట్టేదామని..' శీర్షికన ఆంధ్రజ్యోతిలో వార్తా కథనం ప్రచురితమైంది. టెండర్ల నిబంధనలో లాంగ్‌స్టిక్ లాంగ్‌బూమ్ ధ్రువీకరణ తప్పనిసరి చేయడంతో రాజకీయ పలుకుబడి, పర్సంటేజీలతో ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకునే ఒక కాంట్రాక్టరు ఈ కాంట్రాక్టు తనకే వస్తుందన్న అతి ధీమాతో ఉన్నారు. దీనిలో భాగంగానే రెండు నెలల క్రితమే కూనవరం మొగ వద్ద డ్రెడ్జింగ్ యంత్ర సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. సాక్షాత్తూ ఇరిగేషన్ సూపరింటెండెంట్ పిలిచిన టెండర్లలో ఇకసారి లాంగ్‌స్టిక్ లాంగ్‌బూమ్ తప్పనిసరి అనే నిబంధన తొలగించారు. తర్వాత ఏమైందో ఏమో మళ్లీ అదే నిబంధనతో అదే పనికి రెండోసారి టెండరు నోటిఫికేషన్ పిలవడం ఇరిగేషన్ కాంట్రాక్టర్లలో చర్చనీయాంశంగా మారింది. లాంగ్‌స్టిక్ లాంగ్‌బూమ్ ధ్రువీకరణ ఉన్న ఒక కాంట్రాక్టరు అతి ధీమాతో ఇక్కడ యంత్ర సామగ్రిని సిద్ధం చేసుకున్నారంటే కింద స్థాయి నుంచి ఉన్నతస్థాయి వరకు కూటమి పెద్దల సంపూర్ణ సహకారం ఏ స్థాయిలో అందిస్తున్నారనడానికి ఈ టెండర్లలో మార్పే ఒక ఉదాహరణగా పేర్కొనవచ్చు. అసలు కూనవరం మొగ పునరుద్ధరణ పనులు మొక్కుబడిగానే ముగించేయవచ్చనే ఆరోపణలు అప్పుడే వెల్లువెత్తుతున్నాయి. డ్రెడ్జింగ్ పనులు అంటే మహా ఇష్టంగా భావించే ఒక అధికారి ఈ తరహా కుట్రలకు తెర లేపుతున్నారని సదరు అధికారిపై ఇరిగేషన్ ఉన్నతాధికారికి ఫిర్యాదు చేయడంతో పాటు ఇటీవల కోనసీమ జిల్లాలో సదరు కాంట్రాక్టరుకు పనులు కట్టబెట్టేందుకు అడ్డగోలు నిబంధనలను సాకుగా చూపుతున్నారని ఇరిగేషన్ కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. పనులు జరుగుతాయో లేదో అన్న అనుమానాన్ని వారు వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహాత్మా జ్యోతిబా పూలే ఏపీ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో 5వ తరగతి ప్రవేశాలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసినట్టు జిల్లా కన్వీనర్, బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైటీఎస్ రాజు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి విద్యార్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పంపించాలన్నారు. ఈ నెల 15 నుంచి మార్చి 15వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. కోనసీమ జిల్లాలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల (బాలురు-ఫిషర్‌మెన్) అమలాపురంలో 80 సీట్లు, రామచంద్రపురం బాలికల పాఠశాలలో 40 సీట్లు చొప్పున ఖాళీగా ఉన్నాయన్నారు. అదే విధంగా 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్లకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. మరిన్ని వివరాల కోసం ఆయా గురుకుల పాఠశాలల పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల లోపు సంబంధిత ప్రిన్సిపాల్స్‌ను సంప్రదించవచ్చునని రాజు తెలిపారు.

పీఎం కిసాన్ పథకం కింద జిల్లాకు రూ.24.70 కోట్లు

- లక్షా 24వేల మంది రైతులకు లబ్ధి
- మూడు విడతల్లో నిధులు మంజూరు

అమలాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ యోజన పథకం కింద రైతులకు పెట్టుబడి సహాయాన్ని అందించే లక్ష్యంతో మూడు విడతలుగా కేంద్ర ప్రభుత్వం డీబీటీ విధానం ద్వారా రైతుల ఖాతాకు జమ చేయనుంది. దీనిలో భాగంగా రైతులకు మొదటి విడత నిధులు ఏప్రిల్ నుంచి జూలై వరకు అందజేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలోని లక్షా 24 వేల మంది రైతులకు రూ.24.70 కోట్లను పీఎం కిసాన్ పథకం కింద అందజేయడానికి ప్రభుత్వం నిర్ణయించింది. మొదటి విడత ఏప్రిల్ నుంచి జూలై వరకు రూ.2వేల వంతున రెండో విడత ఆగస్టు నుంచి నవంబరు వరకు రూ.2 వేలు వంతున మూడో విడత డిసెంబరు నుంచి మార్చి వరకు రూ.2 వేలు వంతున డీబీటీ విధానంలో రైతుల ఖాతాకు నేరుగా జమ చేయనున్నారు. ఇప్పటి వరకు 18 విడతల్లో రూ.16,628 కోట్ల లబ్ధిని రైతులకు చేకూర్చారు. ఈ నెల 24వ తేదీన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ద్వారా పీఎం కిసాన్ నిధులను విడుదల చేయడానికి నిర్ణయించారు. రైతులు పెట్టుబడులు, వ్యవసాయ పరికరాల కొనుగోలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు వంటి కొనుగోళ్లకు ఈ నిధులు వినియోగించే అవకాశం ఉన్నట్టు ప్రభుత్వం పేర్కొంది.

66,578 మంది రైతుల 'విశిష్ట గుర్తింపు' నమోదు

అల్లవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 66,578 మంది రైతుల విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసినట్లు జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు చెప్పారు. అల్లవరంలో జరుగుతున్న రైతు విశిష్ట గుర్తింపు నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వ్యవసాయ పథకాలకు సరైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు వర్తింప చేయడానికి కొత్తగా రైతు విశిష్ట నమోదు తీసుకువచ్చినట్లు చెప్పారు.. దీని ద్వారా పీఎం కిసాన్ చెల్లింపులు, పెట్టుబడి సాయం, పంటల బీమా, ధాన్యం విక్రయాలు, యాంత్రీకరణ పరికరాల పంపిణీ, వడ్డీ రాయితీ ప్రయోజనాలు పొందవచ్చునన్నారు. ఈ నెల 25వ తేదీలోగా విశిష్ట గుర్తింపు నమోదు పూర్తి చేయాలన్నారు. ప్రతీ రైతు శ్రద్ధగా నమోదు చేయించుకోవాలన్నారు. అల్లవరం మండలంలో 3344 మంది రైతు విశిష్ట సంఖ్య నమోదు పూర్తి అయిందని మండల వ్యవసాయాధికారి నందెపు వీరవెంకటసత్యనారాయణ చెప్పారు. మొల్లేటి శుభగణేష్, పాటి సింహాద్రి, సీహెచ్ వెంకటఈశ్వర్, బి.యుగశ్రావణి, అరిగెల తాతయ్యనాయుడు, కె.సాయిబాబు, ఎ.నాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

నిర్వాసితులు పరిహారం తీసుకోవాలి

ఆక్వా చెరువులను ధ్వంసం చేస్తున్న తీరును పరిశీలించిన కలెక్టర్ మహేష్‌కుమార్



గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు కరవాకలో తొలగిస్తున్న చెరువుల పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): 216 జాతీయ రహదారి విస్తరణలో భాగంగా బైపాస్ రోడ్డు నిర్మాణం వల్ల భూ సేకరణకు అవార్డు పాసై భూములు, ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులు త్వరితగతిన నష్టపరిహారం తీసుకోవాలని అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ సూచించారు. మండల పరిధిలోని మామిడికుదురు, పాశర్లపూడి గ్రామాల్లో నిలిచిపోయిన బైపాస్ రోడ్డు పనులను బుధవారం ఆయన పరిశీలించి నిర్వాసితులతో మాట్లాడారు. ప్రజాప్రయోజనాల దృష్ట్యా రోడ్డు నిర్మాణం ఆగదని, ఇప్పటికే అటూ ఇటూ రోడ్ల నిర్మాణాలు పూర్తి కావచ్చాయని, మామిడికుదురులో 300 మీటర్లు, పాశర్లపూడిలో 200 మీటర్లు నిర్వాసితుల అభ్యంతరాల వల్ల పనులు నిలిచిపోయినట్టు తెలిపారు. దీనిపై స్థానిక నిర్వాసితులు మాట్లాడుతూ తాము విలువైన భూములు కోల్పోతున్నామని, పరిహారాన్ని చదరపు గజాల్లో చెల్లించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై ఆయన మాట్లాడుతూ ముందు నష్టపరిహారం తీసుకోవాలని, భూముల విలువ పెంపు కోసం తదుపరి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తగు న్యాయం చేయడానికి కృషి చేస్తానన్నారు. రోడ్డు నిర్మాణంలో అడ్డంకిగా ఉన్న ఇళ్లు కోల్పోయిన వారు రోడ్డు నిర్మాణం నిలుపుదల చేయాలనే నెపంతో ఇళ్ల విలువలను గణించడానికి సహకరించడం లేదని, ఆ విధంగా చేయడం సరికాదని ఆర్అండ్‌బీ అధికారుల ద్వారా ఇళ్లు కోల్పోయినవారు అంచనాల విలువలు గణించేందుకు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ పరంగా నిర్వాసితులకు అన్నివిధాలా సహకారం అందిస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదన్నారు. అనంతరం ఈదరాడ గ్రామంలో నిర్వహిస్తున్న రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో సందర్శించి భూ సర్వే ఆధారంగా రీసర్వే ప్రక్రియ నిర్వహిస్తున్నదీ లేనిదీ తెలుసుకున్నారు. రీసర్వేను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించి రెవెన్యూ రికార్డులను పూర్తిగా స్వచ్ఛీకరించి ఆన్‌లైన్‌లో పొందుపరచాలని ఆదేశాలిచ్చారు. కరవాక గ్రామంలో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల ప్రకారం పర్యావరణానికి విఘాతం కలిగించే విధంగా ఉన్న ఆక్వా చెరువులను ధ్వంసం చేస్తున్న తీరును పరిశీలించి ఎన్జీటీ ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేస్తూ అనధికారికంగా అక్రమ చెరువులను త్వరితగతిన ధ్వంసం చేయాలని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్‌తో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డు సహాయ సంచాలకులు కె.ప్రభాకర్, తహశీల్దార్ సుబ్రహ్మణ్యాచార్యులు, డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, రెవెన్యూ, మత్స్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలి

అమలాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ రెవెన్యూ, సర్వేను సిబ్బందిని ఆదేశించారు. మార్చి నెలాఖరు నాటికి గ్రౌండ్ వర్క్ పూర్తి చేయాలన్నారు. బుధవారం అమరావతి నుంచి రాష్ట్ర భూపరిపాలన ముఖ్య కమిషనర్ జి.జయలక్ష్మి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సంచాలకుడు ఎన్.ప్రభాకర్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి మహేష్‌కుమార్ పాల్గొన్నారు. సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పాత సర్వే నంబర్లు, కొత్త సర్వే నంబర్ల వ్యత్యాసాలను సరి చేయాలన్నారు. మ్యాప్‌లను రూపొందించాలన్నారు. బ్లాక్‌లు ఆధారంగా ప్రభుత్వ భూములను గుర్తిస్తూ గ్రామాల్లో సర్వేను నిర్వహించాలన్నారు. భూ సంబంధిత ఫిర్యాదులను పరిష్కరించే విషయంలో అధికారులు అలసత్వం వహించరాదన్నారు. భూ యజమానులకు మూడుసార్లు అవకాశం ఇస్తూ భవిష్యత్తులో ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేకుండా వారి సమక్షంలో మాత్రమే సర్వేను నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతీ బ్లాక్‌లో 250 ఎకరాలకు మించకుండా సర్వేకు చర్యలు చేపట్టాలన్నారు. స్టాండర్డ్ ఆఫ్ ప్రొసీజర్ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకుడు కె.ప్రభాకర్, రెవెన్యూ, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



ఏర్పాట్లు చాలా బాగున్నాయి

యోగేష్ పరబ్, స్టేట్ స్పోర్ట్స్ ఆర్గనైజర్, గోవా

ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్స్‌కి చాలా రాష్ట్రాలకు వెళ్లాను. కానీ కాకినాడలో క్రీడాకారుల పట్ల చూపిన అభిమానం ఎక్కడా చూడలేదు. బస చేసేందుకు హోటల్ రూమ్స్, వెళ్లి, వచ్చేందుకు ట్రావెలింగ్, భోజన ఏర్పాట్లు అన్నీ బాగున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన మైదానం ఆటకు ఎంతో అనుకూలంగా ఉంది.



ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్‌లో ఆడాలన్న కల నెరవేరింది

బి.సురేష్‌రాజు, ఆంధ్రప్రదేశ్ జట్టు కెప్టెన్

ప్రతి హాకీ క్రీడాకారుడికి ఆస్ట్రో టర్ఫ్ గ్రౌండ్‌లో ఆడడం ఒక కల. ఆ కల కాకినాడలో జరుగుతున్న ఆలిండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో నెరవేరింది. ఈ గ్రౌండ్‌లో ఆటను ఆస్వాదిస్తూ ఆడొచ్చు. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో గోవాపై టీమ్ స్పిరిట్‌తో గెలిచాం. ఆ గెలుపు మా జట్టుకు మరింత స్ఫూర్తినిచ్చింది.



అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలు

మారేశ్వరన్, సీబీడీటీ టీమ్, తమిళనాడు

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలున్న మైదానంలో ఆడడం చాలా బాగుంది. బ్లూ టర్ఫ్ గ్రౌండ్ చాలా స్పీడ్‌గా ఉంది. ఆటను ఆస్వాదించగలుగుతున్నాం. 2022లో ఆసియా క్రీడల్లో బ్రాంజ్ మెడల్ సాధించాము. జూనియర్స్, సీనియర్స్‌లో ఇండియా తరఫున ఎన్నో మ్యాచ్‌లు ఆడాను.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి)


పురుషుల విభాగంలో చండీఘర్, బెంగళూరు మధ్య హోరాహోరీగా జరుగుతున్న మ్యాచ్


హాక్రీడోత్సాహం

కాకినాడలో ఐదో రోజుకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు


గోల్ చేయడానికి రెడీ

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో జరుగుతున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంటు బుధవారం ఐదో రోజుకు చేరుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాల మహిళలు, పురుషుల జట్లకు సంబంధించి మొత్తం ఎనిమిది మ్యాచ్‌లు జరిగాయి. ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్, ఎన్విరాన్మెంట్, హైడ్రాలజీ శాస్త్రవేత్త సత్యాజీరావు, డీఎస్డీవో శ్రీనివాస్‌కుమార్, హాకీ కోచ్ రవిరాజు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, రాజస్థాన్ సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 7-1 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ భువనేశ్వర్, ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ ఉత్తరాఖండ్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఆర్ఎస్బీ చండీఘర్, ఆర్ఎస్బీ బెంగళూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆర్ఎస్బీ బెంగళూరు 4-1 తేడాతో గెలుపొందింది. తెలంగాణ సెక్రటేరియట్, గోవా సెక్రటేరియట్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తెలంగాణ సెక్రటేరియట్ 21-0 తేడాతో విజయం సాధించింది. సెంట్రల్ సెక్రటేరియట్, ఆర్ఎస్బీ అహ్మదాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 3-0 తేడాతో విజయం సాధించింది. మహిళల విభాగంలో... సెంట్రల్ సెక్రటేరియట్, రాజస్థాన్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో సెంట్రల్ సెక్రటేరియట్ 5-0 తేడాతో విజయం సాధించింది. ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్, కేరళ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఛత్తీస్‌గఢ్ సెక్రటేరియట్ 13-0 తేడాతో విజయం సాధించింది. ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్, మధ్యప్రదేశ్ సెక్రటేరియట్ మధ్య జరిగిన మ్యాచ్‌లో ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్ 18-0 తేడాతో విజయం సాధించింది.


విజయం అనంతరం హాకీ స్టిక్‌ని ముద్దాడుతున్న క్రీడాకారిణి


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఆర్ అదనపు ఎస్పీ శ్రీనివాస్


మహిళల విభాగంలో కేరళ వర్సెస్ ఛత్తీస్‌గఢ్


ప్రమాణస్వీకారం అనంతరం ఉమ్మడి జిల్లా ఆర్యవైశ్య సంఘ నూతన కార్యవర్గం

సేవా తత్పరులు ఆర్యవైశ్యులు

ఉభయ గోదావరి జిల్లాల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల బాబి

అన్నవరంలో అట్టహాసంగా నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం

అన్నవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం కాకినాడ జిల్లా అన్నవరంలోని ఒక ప్రైవేటు లాడ్జిలో బుధవారం జరిగింది. ముందుగా సంఘ సభ్యులు సత్యదేవుడిని దర్శించుకున్నారు. అనంతరం కొండ దిగువన గౌరవాధ్యక్షుడు ప్రగళ్లపాటి కనకరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల బాబి, కార్యదర్శిగా కుసుమంచి పాపారావు, కోశాధికారిగా కంచర్ల కృష్ణమోహన్, సభ్యులు ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా కనకరాజు మాట్లాడుతూ ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామ సుబ్రహ్మణ్యం ఆశీస్సులతో ఏర్పడిన ఈ కమిటీ అంతా పేద వైశ్యుల సంక్షేమానికి పాటుపడడమే కాకుండా వాణిజ్యపరంగా ఎవరికి ఏ ఇబ్బంది కలిగినా ముందుండాలన్నారు. అధ్యక్షుడు కంచర్ల బాబి మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి అప్పగించిన పదవికి న్యాయం చేకూరుస్తానన్నారు. అందరి కష్టాల్లో పాలుపంచుకోవడమే కాకుండా ఆర్యవైశ్యులు అంటే సేవాతత్పరులు అనే భావనకు మరింత వన్నె తెస్తానన్నారు. జోనల్ చైర్మన్ బత్తుల నానాజీ, మండవల్లి వెంకన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు సీతామహాలక్ష్మి, దాసరి శ్రీనివాస్, జయవరపు విహారి, దాసరి నగేష్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్తిపాడు మండలం పాదురుపాకలో పార్వతి ఇంటి ఆవరణలో పెళ్లి పందిరి

కీర్తిశేషులకు పెళ్లి

పాండవులపాలెం పంచాయతీ పాదురుపాకలో వెలుగుచూసిన ఘటన

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మరణించిన 20 ఏళ్ల తర్వాత ఓ జంటకు పెళ్లి జరిగింది. ఆశ్చర్యపోతున్నారా! మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది నిజం. మరణించిన తర్వాత వారి తల్లిదండ్రుల వివాహం జరిపించేందుకు వారి కుటుంబీకులు సిద్ధమైన అరుదైన ఈ సంఘటన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పాండవులపాలెం గ్రామ పంచాయతీ పాదురుపాకలో బుధవారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పాదురుపాకకు చెందిన సోమాల బాబూరావు-భూలక్ష్మి దంపతుల కుమార్తె పార్వతి వివాహ వయసు వచ్చిన తర్వాత (ఇరవై ఏళ్ల కిందట) చనిపోయింది. అదే గ్రామానికి చెందిన ఇరకనూకరత్నం కుమారుడు రాంబాబు 15 ఏళ్ల క్రితం చనిపోయాడు. వీరిలో పార్వతి రాంబాబును ఇష్టపడి జీవించిన కాలంలో పెళ్లి చేసుకోవాలనుకునేది. వివాహం జరగకుండానే పార్వతి మృతి చెందింది. ఆ తర్వాత రాంబాబు కూడా మృతి చెందాడు. ఇటీవల పార్వతి తన కుటుంబ సభ్యుల కలలోకి వచ్చి తమకు పెళ్లి చేయాలని కోరింది. దీంతో ఇరు కుటుంబాల వారు మరణించిన పార్వతి, రాంబాబులకు హిందూ సంప్రదాయ పద్ధతిలో పెళ్లి పందిరి వేసి బుధవారం వివాహం జరిపించారు. గ్రామస్తులకు విందు భోజనాలు కూడా పెట్టారు. ఇది ఆనోటా, ఈనోటా బయటకొచ్చింది.


రజత కవచాలను సమర్పిస్తున్న భరత్‌కుమార్, సింధూర

రమా సత్యనారాయణస్వామికి 5.700 కిలోల వెండి కవచం సమర్పణ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న రమా సత్యవతీ సమేత సత్యనారాయణస్వామికి బుధవారం యానాంకు చెందిన కర్రి సుబ్బిరెడ్డి-హైమావతి దంపతుల కుమారుడు భరత్‌కుమార్-సింధూర దంపతులు 5.700 కిలోలతో రజత కవచం చేయించారు. బుధవారం దానిని ఆలయ సహాయ కమిషనరు, ఈవో అల్లు వెంకట దుర్గాభవానీకి సమర్పించారు. వెండి కవచాలకు దేవులపల్లి ఫణిరామకృష్ణ సంప్రోక్షణ చేయించారు. అనంతరం అర్చకుడు కొంతేటి శ్రీనివాస భీమశంకరం స్వామి, అమ్మవార్లకు అలంకరించారు.



రజత కవచాలంకరణలో స్వామి, అమ్మవార్లు

ఆర్ట్స్ కళాశాలలో నేటి నుంచి ఉద్భవ్ యూత్ ఫెస్టివల్

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఉద్భవ్-2025 పేరుతో ఈ నెల 20, 21, 22 తేదీల్లో నేషనల్ యూత్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ రామచంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేషనల్ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామన్నారు. ఆఫ్‌లైన్ ఈవెంట్స్‌లో భాగంగా క్లాసికల్ డ్యాన్స్, పేట్రియాటిక్ డ్యాన్స్, లైట్ మ్యూజిక్, ఫోక్, ట్రైబల్ డ్యాన్స్, ఫిల్మ్ డ్యాన్స్ జరుగుతాయన్నారు. కళాశాలలోని ఓపెన్ ఆడిటోరియంలో ఉదయం 11 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం జరుగుతుందని ప్రిన్సిపాల్ చెప్పారు.


పొల్లూరు జలపాతం వద్దకు స్వామివారిని తీసుకొస్తున్న దృశ్యం (పాత చిత్రం)

గిరిజనుల పెద్ద పండుగ మన్యంకొండ జాతర

వచ్చే నెల 3న పొల్లూరు జలపాతం వద్ద నిర్వహణ

మోతుగూడెం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల పెద్ద పండుగ మన్యంకొండ జాతర. దీనిని ఒడిశా ప్రభుత్వం ప్రతి రెండేళ్లకోసారి అధికారంగా నెల రోజులు నిర్వహిస్తుంది. అయితే మార్చి 3న అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలోని పొల్లూరు జలపాతం వద్ద ఒక రోజు జాతర జరుపుతారు. ఒడిశాలోని మల్కన్‌గిరి జిల్లా మన్యంకొండ గ్రామంలో ఉన్న గిరిజన వనదేవతలు కన్నమరాజు (శ్రీకృష్ణుడు), బాలరాజు (అర్జునుడు), పోతురాజు (భీముడు), ముత్యాలమ్మ తల్లి ఘటం ధ్వజాల రూపంలో పూజలు అందుకుంటాయి. వీటికి ప్రతి రెండేళ్లకోసారి ప్రాణ ప్రతిష్ఠ చేస్తారు. ఈ కార్యక్రమాన్ని మోతుగూడెం వద్ద ఉన్న పొల్లూరు జలపాతం వద్ద నిర్వహించడం ఆచారంగా వస్తోంది..

మోతుగూడెంలో మన్యంకొండ జాతరను తిలకించడానికి వేరే రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో గిరిజనులు తరలివస్తారు. ఫిబ్రవరి 11న మొదలైన జాతర మార్చి 12 వరకు కొనసాగుతుంది. పొల్లూరు జలపాతం వద్ద మార్చి 3న ప్రధానమైన మంగళస్నానం, ప్రాణ ప్రతిష్ఠ జరుగుతాయి. ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి రూపం లేకుండా ఉన్న ముత్యాలమ్మ తల్లి ఘటం, ధ్వజం రూపంలో ఉన్న సోదరులు (కన్నమరాజు, బాలరాజు, పోతురాజు)తో కలిసి మన్యంకొండ చేరుకుంటుంది. అదే సమయంలో మోతు బ్లాక్‌లో ఉన్న నడవనపల్లి గ్రామంలో నుంచి గద్వాల కోసం కొత్త వెదురులను తీసుకుని పూజారులు మన్యం కొండ వస్తారు. కొండ గృహాలు ఉన్న మూల రూపాలకు ప్రత్యేక పూజలు చేసి బోయ యాత్రకు బయల్దేరతారు. ఈ యాత్రలో వేలాదిగా గిరిజన భక్తులు కాళ్లకు చెప్పులు లేకుండా కొండకోనలు ఎక్కుతూ వాగులు, వంకలు దాటుతూ వన దేవతతో పాటు నడక సాగిస్తారు.

సంప్రదాయంగా మేళతాళాలు, థింసా నృత్యంతో సీలేరు నది ఆనుకుని ఉన్న ఒడిశాలోని అవతల పొల్లూరుకు మార్చి 2న జాతర చేరుకుంటుంది. మార్చి 3 ఉదయం పూజా కార్యక్రమాలు ముగిసిన తర్వాత కొత్తగా తయారు చేసిన ప్రత్యేక పడవలపై వన దేవతలను నది దాటించి ఆంధ్రాలోని పొల్లూరు జలపాతం వద్దకు తీసుకొస్తారు. అక్కడ వనదేవతలకు మంగళస్నానం చేయించి పాత ధ్వజాలను నిర్వీర్యం చేసి కొత్త ధ్వజాలకు ప్రాణ ప్రతిష్ఠ చేసి భక్తులు దర్శించుకునేందుకు జలపాతం వద్ద ఉంచుతారు. అనంతరం బలి పూజ చేసుకుంటారు. తిరిగి ప్రయాణమై మన్యంకొండకు చేరుకుంటారు. ఈ జాతరను వీక్షించడానికి సుమారు 20వేల మంది భక్తులు తరలివస్తారు.

పొల్లూరు వద్దకు చేరుకున్న తర్వాత వన దేవతలకు జలపాతం చెంతన ఉన్న గృహంలో ప్రత్యేక పూజలు చేస్తారు. పూజలకు సంతృప్తి చెందిన ముత్యాలమ్మను జలపాతంలో బంగారు చేప రూపంలో పూజరులు భక్తులకు దర్శనం చేయిస్తారని నమ్మకం. వన దేవతలతో పాటు జలపాతంలో పుణ్య స్నానాలు చేసేందుకు భక్తులు పోటీపడతారు. అనంతరం జలపాతం వద్ద ఉంచిన ఆసనంపై అలంకరించిన వన దేవతలను భక్తులు దర్శించుకుంటారు.

వయసు నూరేళ్లు... ఖరీదు 35 లక్షలు

● కడియం నర్సరీలో వింతైన రూపంతో ఆకర్షిస్తున్న విదేశీ చెట్టు

కడియం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియం నర్సరీలకు ఇప్పటివరకు అనేక రకాల విదేశీ మొక్కలు దిగుమతి అయ్యాయి. అవి ఈ ప్రాంతానికి మంచి గుర్తింపు కూడా తీసుకొచ్చాయి. తాజాగా కడియపులంక శివాంజనేయ నర్సరీ రైతు మల్లు పోలరాజు కొద్ది రోజుల క్రితం వింత ఆకారాలతో తీసుకొచ్చిన చెట్లు ఆకట్టుకుంటున్నాయి. దక్షిణ అమెరికాలో విరివిగా ఉండే వీటిని స్పెయిన్, థాయిలాండ్ వంటి దేశాల్లో విక్రయిస్తున్నారు. పెద్ద పార్కులు, హోటళ్లు, గార్డెన్స్‌ల్లో ప్రత్యేక అలంకరణగా వీటిని పెంచుతారు. వయసు 100 నుంచి 120 ఏళ్లు ఉంటుంది. ఒక్కో చెట్టు ఖరీదు రూ.35 నుంచి రూ.40 లక్షలు ఉంటుంది. ఈ చెట్లను భారీ కంటైనర్లలో తీసుకొచ్చారు. ప్రస్తుతం మోడుగా ఉన్న వీటికి కొమ్మలు వచ్చి రంగురంగుల పూలు పూస్తాయని పోలరాజు తెలిపారు. 'సిల్క్ ఫ్లోస్' ట్రీ'గా పిలువబడే ఈ చెట్టు శాస్త్రీయ నామం 'కొరిసియా స్పెసియోసా'. ఇవి కడియం నర్సరీలతో పాటు హైదరాబాద్ సమీపంలోని 150 ఎకరాల పార్కులో ఉన్నాయి.



జేఎన్టీయూకే నూతన వీసీ బాధ్యతల స్వీకరణ



వీసీగా బాధ్యతలు స్వీకరిస్తున్న సీఎస్ ఆర్కే ప్రసాద్

● ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్‌కు అభినందనలు తెలిపిన వర్సిటీ అధికారులు, తదితరులు

జేఎన్టీయూకే, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూకే ఉపకులపతిగా నియామకమైన ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్ బుధవారం మధ్యాహ్నం వీసీ ఛాంబర్‌లో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వర్సిటీ అధికారులు, మాజీ ఉపకులపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం వీసీ సమావేశపు హాల్లో రిజిస్ట్రార్, ఓఎస్డీ, డైరెక్టర్లు, ప్రిన్సిపాల్స్, విభాగాధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ తనను వీసీగా నియమించినందుకు సీఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి లోకేష్‌కి కృతజ్ఞతలు తెలిపారు. జేఎన్టీయూకే విశ్వవిద్యాలయానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉందని ఆపేరు ప్రఖ్యాతులను కాపాడుకుంటూ మరింత ఉన్నతస్థానానికి చేరుకునేలా అందరూ కలిసికట్టుగా కృషిచేయాలన్నారు. పూర్వ విద్యార్థులు యూనివర్శిటీ అభివృద్ధికి తమవంతు సహకారమందించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ఆశయాలకు అనుగుణంగా దేశాన్ని 2047లో అభివృద్ధిపథంలో పయనింపజేసేలా చేపడుతున్న వికసిత్ భారత్, సీఎం చంద్రబాబు నాయుడు లక్ష్యమైన స్వర్ణాంధ్రప్రదేశ్-2047 సాధనకు కృషిచేస్తూ వర్శిటీ అభివృద్ధికి సంబంధించిన విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించాలన్నారు. జేఎన్టీయూకే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో టాప్ 100లో ఉండేలాగా, మెరుగైన ఎన్‌బీఏ ర్యాంకింగ్ సాధనకు కృషిచేద్దామన్నారు. అధ్యాపకులు ముఖ్యంగా పరిశోధనలకు ప్రాధాన్యతను ఇవ్వాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, అప్పుడే నాణ్యత కలిగిన పరిశోధనలు చేపట్టవచ్చని తెలిపారు. విద్యార్థులను స్టార్టప్స్, ఆవిష్కరణలు పట్ల ఆసక్తి చూపేలా ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులకు విలువలతో కూడిన విద్యనందించడంతో పాటు ఇంజనీరింగ్ విద్యలో వస్తున్న మార్పులకనుగుణంగా బోధన ఉండేలా ప్రణాళిక చేపట్టడం జరుగుతుందన్నారు. సమావేశంలో ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్ రవీంద్రనాథ్, ఓఎస్డీ కోటేశ్వర రావు, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, మాజీ వీసీ జీవీఆర్ ప్రసాదరాజు డైరెక్టర్లు సాయిబాబు, రవీంద్ర, కృష్ణ, గోపాలకృష్ణ, బాలకృష్ణ, పద్మజారాణి, వెంకట రెడ్డి, శ్రీనివాసులు, కృష్ణప్రసాద్, కుమారస్వామి ప్రిన్సిపాల్స్, వైస్ ప్రిన్సిపాల్స్ అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నేడు బాధ్యతలు స్వీకరించనున్న నన్నయ వర్సిటీ వీసీ

దివాన్‌చెరువు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం నూతన ఉప కులపతిగా ప్రభుత్వం నియమించిన ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టనున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో ప్రస్తుతం ఆంగ్లశాఖ ఆచార్యులుగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉదయం 11 గంటలకు ఉద్యోగ బాధ్యతలు చేపడతారు. ఈ సమాచారం అందుకున్న ఇక్కడి వర్సిటీ అధికారులు అవసరమైన ఏర్పాట్లు చేశారు. వర్సిటీ అధికారులు, తదితరులు పాల్గొంటారు.

పౌల్ట్రీ పరిశ్రమ సమస్యలపై సీఎంకి వినతి



చంద్రబాబుకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటసుబ్బారావు, తదితరులు

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏపీలో బర్డ్‌ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర నష్టాలను ఎదుర్కొంటుండడంతో సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం అందజేసినట్టు రాష్ట్ర పౌల్ట్రీ ఫెడరేషన్ అధ్యక్షుడు, కాల్ధరి గ్రామానికి చెందిన పౌల్ట్రీ యజమాని కోమట్లపల్లి వెంకటసుబ్బారావు బుధవారం విలేకరులకు తెలిపారు. బర్డ్ ఫ్లూ వల్ల పౌల్ట్రీ పరిశ్రమ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందని, వేలాది కోళ్లు, లక్షలాది గుడ్లు కొనుగోలు లేక పాడైపోయి నష్టాలను చవిచూస్తున్నట్టు సీఎంకి వివరించామన్నారు. దీనిపై ప్రభుత్వం నుంచి పూర్తి సహాయసహకారాలు అందిస్తామని హామీ ఇచ్చినట్టు వెంకటసుబ్బారావు చెప్పారు. అలాగే మంత్రి అచ్చెన్నాయుడును కలిశామన్నారు. ఈయనతోపాటు ఫెడరేషన్ సభ్యులు, తదితరులు ఉన్నారు.

మాయమాటలు చెప్పి... మహిళలను మోసగించి

● ఇద్దరిపై కేసు నమోదు

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : మాయమాటలు చెప్పి మహిళలను మోసగించిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్‌ఐ కే. శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాలివి.. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరుకు చెందిన బొజ్జా సింధూ, ఆమె బంధువు దుద్దుకూరుకి చెందిన మరో మహిళను ఫైనాన్స్ కంపెనీలో ఇంటిపై రుణం ఇప్పిస్తానని చెప్పి నమ్మించారు. దీంతో కొవ్వూరు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కడిమి శ్రీనుబాబు, మెరిపో కృష్ణ దఫదఫాలుగా రూ. 3,45,000 తీసుకున్నారు. ఈ నెల 13వ తేదీన సింధూ తన భర్తతో కలిసి ధర్మవరం వెళ్లి అడగ్గా, ఆ ఇద్దరు వ్యక్తులు దురుసుగా మాట్లాడి, కొట్టి చంపుతానని బెదిరించారు. దీనిపై కొవ్వూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు.

గోదాట్లో దూకేశాడా?

● యువకుడి అదృశ్యం .. ఆందోళనలో కుటుంబ సభ్యులు
● రోడ్డు కం రైలు వంతెనపై కనిపించిన సాయితేజ బైక్
● నదిలో గాలిస్తున్న బంధువులు



గగ్గురోతు సాయితేజ

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : కొవ్వూరు మండలం దొమ్మేరుకి చెందిన గగ్గురోతు సాయితేజ (25) కనిపించడం లేదని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు. సాయితేజ రాజమహేంద్రవరంలో ఓ గేదెల ఫాంలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజు మాదిరిగా నే బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు వెతకడం ప్రారంభించారు. కొవ్వూరు రోడ్ కం రైలు బ్రిడ్జిపై మోటారు సైకిల్‌ను గుర్తించారు. సాయితేజ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉండటం, ఆచూకీ లభించకపోవడంతో గోదావరి నదిలో జాలర్ల సహాయంతో గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. ఈ మేరకు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి వరకు ఆచూకీ తెలియరాలేదు. మోటారుసైకిల్ బ్రిడ్జిపై పెట్టి ఎక్కడికైనా వెళ్లి ఉంటాడా, లేదా గోదావరి నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడా అనే సందేహం వ్యక్తమవుతోంది. అదృశ్యమైన యువకుడి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కొవ్వూరు పట్టణ హెడ్‌కానిస్టేబుల్ ఆర్. సాంబమూర్తి కేసు నమోదు చేశారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు

రాజానగరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ రాజమహేంద్రవరంలోని 2వ అదనపు అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు తీర్పు వెలువరించారు. రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021 సంవత్సరంలో నమోదైన ఈ కేసుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందరాడ గ్రామానికి చెందిన దువ్వాటి సామ్యూల్‌రాజును చప్పిడి శివకాశి చాకుతో గాయపర్చి హత్యాయత్నం చేయడంపై అప్పటి ఎస్.ఐ శివనాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. దాదాపు నాలుగేళ్ల తర్వాత కోర్టులో విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో సామ్యూల్‌రాజుకు మూడేళ్ల జైలు శిక్ష, రూ.10వేలు జరిమానా విధిస్తూ జడ్జి కె.ప్రకాష్‌బాబు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ పీవీ వీఎస్‌బీ రాజు వాదించగా, సీఐ ప్రసన్న వీరయ్యగౌడ్ పర్యవేక్షణలో కోర్టు కానిస్టేషబుల్స్ దుర్గాప్రసాద్, వెంకటరమణ సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టారన్నారు.

గామన్‌బ్రిడ్జిపై కారు దగ్ధం

●ఏసీలో తలెత్తిన షార్ట్‌సర్క్యూట్ కారణం ● మంటలను అదుపు చేసిన అగ్నిమాపక సిబ్బంది



బ్రిడ్జిపై కాలిపోతున్న కారు (ఇన్‌సెట్లో), మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

కొవ్వూరు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఏసీ కంప్రెషర్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా కారు నుంచి మంటలు చెలరేగాయి. ఈ సంఘటన కొవ్వూరు గామన్‌బ్రిడ్జిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే గోపాలపురం మండలం వాదాలకుంటకి చెందిన బండెల కృష్ణారావు తన ఇండిగో కారులో సీతానగరం వెళ్తున్నాడు. మార్గమధ్యలో కొవ్వూరు గామన్‌బ్రిడ్జి 33వ స్తంభం వద్దకు వచ్చేసరికి కారు నుంచి ఒక్కసారిగా మంటలు వచ్చాయి. దీంతో అందులో ఉన్నవారంతా దిగి బయటకు వచ్చేశారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ ఇన్‌చార్జి ఫైర్‌అధికారి ఎస్. సీతారామయ్య తన సిబ్బందితో వచ్చి మంటలను అదుపుచేశారు. కారు పూర్తిగా కాలిపోయింది. సుమారు రూ. లక్ష ఆస్తినష్టం సంభవించిందన్నారు. ఈ ఘటనతో గామన్‌బ్రిడ్జిపై దొమ్మేరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే రోడ్డులో సుమారు రెండు గంటల పాటు ట్రాఫిక్ స్తంభించింది. లీడింగ్ ఫైర్‌మేన్ పి. అప్పారావు, డ్రైవర్ ఆపరేటర్ బి. పోసియ్య, ఫైర్‌మ్యాన్‌లు ఎం. రవికుమార్, కె.ధనుంజయ, హోంగార్డులు ఎం. శ్రీను, డేవిడ్‌రాజు, పోలీసు కానిస్టేబుల్ రాంబాబు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది వచ్చారు.

కోరంగి ఎకో 'మాస్టర్ ప్లాన్'కి సలహాలివ్వండి

● కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్
● అటవీ, రెవెన్యూ, మత్స్య, తదితర శాఖల అధికారులతో సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్ (కాకినాడ), ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కోరంగి వైల్డ్ అభయారణ్యం ఎకో సెన్సిటివ్ జోనల్ మాస్టర్‌ప్లాన్ తయారీకి సంబంధిత అధికారులు సూచనలు, సలహాలు అందించాలని కాకినాడ కలెక్టర్ షాన్‌మోహన్ కోరారు. బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా అటవీశాఖ అధికారి రవీంద్రనాథ్ రెడ్డితో కలిసి కోరంగి వైల్డ్‌లైఫ్ అభయారణ్యం జోనల్ మాస్టర్ ప్లాన్ తయారీపై అటవీ, రెవెన్యూ, మత్స్య,ఉద్యాన, తదితర శాఖల అధికారులతో కలిసి సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అభయా రణ్యం బయట ఉన్న సరిహద్దు నుంచి వివిధ ప్రదేశాల్లో 26 కిలోమీటర్ల దూరం వరకు ఎకో- సెన్సిటివ్ జోన్ ఉంటుందన్నారు. ఈ జోన్ వల్ల వన్యప్రాణుల స్వేచ్ఛకు, మనుగడకు మరింత భద్రత ఏర్పడుతుందన్నారు. పర్యావరణ సమతుల్యత నెలకొని పచ్చదనం పెంపొందడంతో పాటు సేంద్రియ వ్యవసాయానికి అవకాశం ఉంటుందన్నారు. ఈ జోన్ పరిధిలో వర్షపు నీటిని వివిధ పద్ధతుల్లో నిల్వ చేసుకుని జంతువులకు నీటిసమస్య లేకుండా చేయవచ్చునన్నారు. ఈ నేపథ్యంలో తిరువనంతపురం సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్, డెవలప్‌మెంట్ వారు ఎకో- సెన్సిటివ్ జోనల్ మాస్టర్‌ప్లాన్ తయారు చేయనున్నారన్నారు. తిరువనంతపురం సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్, డెవలప్ మెంట్ ప్రోగ్రాం డైరెక్టర్ వినోద్, హైదరాబాద్ సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంట్ డెవలప్‌మెంట్ రీజినల్ డైరెక్టర్ జయచంద్ర, పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు, మత్స్యశాఖ అధికారి కరుణాకర్ బాబు, గ్రౌండ్ వాటర్ డీడీ రాధాకృష్ణ, కాకినాడ అటవీ అధికారి శ్రీదీప్తి, కోరంగి వైల్డ్‌లైఫ్ అటవీ అధికారి వరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

బాలిక కిడ్నాప్, అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

ముమ్మిడివరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బాలికను మాయచేసి ఆమెపై అత్యాచారంచేసిన కేసులో నిందితుడిని బుధవారం అరెస్టు చేసినట్టు ముమ్మిడివరం ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ తెలిపారు. అనాతవరం గ్రామానికి చెందిన వివాహితుడు పరమట దుర్గాప్రసాద్ (బులిచంటి)(30) ఓ పాఠశాలలో చదువుతున్న బాలికను సోమవారం బలవంతంగా మోటారు సైకిల్ ఎక్కించుకుని అమలాపురం తీసుకువెళ్లి ఎర్రవంతెన సమీపంలో ఉన్న ఓ నివాస గృహంలో ఆమెపై అత్యాచారం చేశాడు. బాలిక పాఠశాలకు హాజరుకాకపోవడం, ఆ బాలిక కూడా ఉన్న విద్యార్థినులు మోటారుసైకిల్‌పై వ్యక్తి బలవంతంగా తీసుకువెళ్లినట్టు పాఠశాల హెచ్‌ఎంకు తెలపడంతో హెచ్‌ఎం ఆ విషయాన్ని బాలిక తండ్రికి ఫోన్‌చేసి తెలిపారు. దీంతో ఆ బాలిక తండ్రి ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఆ విషయం దుర్గాప్రసాద్‌కు తెలియడంతో ఆ బాలికను అమలాపురంలో బస్‌చార్జీలకు డబ్బులిచ్చి బస్ ఎక్కించి పంపించి వేశాడు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే పర్యవేక్షణలో ముమ్మిడివరం సీఐ ఎం.మోహన్‌కుమార్, ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్‌లు కేసు నమోదుచేసి బాలికను వైద్య పరీక్షల నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి పంపించారు. నిందితుడిపై పోక్సో, అత్యాచారం కేసులు నమోదుచేసి ముమ్మిడివరం జ్యూడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించగా మేజిస్ట్రేట్ రహ్మతుల్లా నిందితుడికి రిమాండ్ విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

గొల్లప్రోలులో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

● రూ.3.60లక్షలు విలువైన ఎరువులు సీజ్

గొల్లప్రోలు, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు పట్టణంలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు. కోరమండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌కు చెందిన పట్టణంలోని మన గ్రోమోర్ రిటైల్ సెంటర్‌లో విజిలెన్స్ ఎస్పీ స్నేహిత ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. 14-35-14 రకం కాంప్లెక్స్ ఎరువు 200 బస్తాలకు సంబంధించి ఇన్వాయిస్‌లు లేకపోవడం, రైతులు ఫిర్యాదు చేసేందుకు కంప్లయింట్ బుక్ లేకపోవడం, స్టాక్ బోర్డు మెయిన్‌టెయిన్ చేయకపోవడంతో 6(ఏ) కేసు నమోదు చేశారు. రూ.3.60లక్షలు విలువయిన కాంప్లెక్సు ఎరువులను సీజ్ చేశారు. దాడుల్లో విజిలెన్స్ డీఎస్పీ తాతారావు, సీఐ నాగవెంకటరాజు, ఏవో మధుమోహన్, తూనికలు, కొలతలు శాఖ అధికారి సరోజిని, గొల్లప్రోలు మండల వ్యవసాయాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

తునిలో దొంగల బీభత్సం

● ఎనిమిది షాపుల్లో చోరీ
● షట్టర్లు పగులగొట్టి దుండగుల దోపిడీ





చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఐ, ఎస్‌ఐలు, షాపు తలుపులు పగులగొట్టి చోరీకి పాల్పడుతుండగా రికార్డు అయిన దృశ్యం

తునిరూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తునిలో దొంగలు బీభత్సం సృష్టించారు. తుని మున్సిపల్ వైస్‌చైర్మన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా మారడంతో, పోలీసులు కట్టుదిట్టమైన భద్రతాఏర్పాట్లలో తలమునకలవ్వగా సందట్లో సడేమియా అన్న చందాన దోపిడీ దొంగలు దొరికినకాడికి దోచుకుపోయారు. తాజాగా తునిలో జరిగిన చోరీతో పట్టణవాసులు ఉలిక్కిపాటుకు గురయ్యారు. బుధవారం తెల్లవారుజామున 3నుంచి 4 గంటల ప్రాంతంలో పట్టణశివారు రైల్వే అండర్ పాస్ సమీపంలో వరుసషాపుల్లో షట్టర్లు పగలగొట్టి దుండగులు దోపిడీకి పాల్పడ్డారు. దొంగతనానికి గుంపుగా ప్రవేశించిన వీరు దర్జాగా చోరీకి పాల్పడుతున్న దృశ్యాలు సీసీ కెమెరాలకి చిక్కాయి. ఈ వీడియోలు సోషల్‌మీడియా వేదికగా వైరల్ కావడంతో పోలీస్ పెట్రోలింగ్‌పై విమర్శలు తలెత్తుతున్నాయి. పట్టణంలో పోలీసింగ్ కట్టుదిట్టంగా లేకపోవడంతో ఇటువంటి ఘటనలు పునరావృతం అవుతున్నాయి. దొంగలను త్వరితగతిన పట్టుకుని ఇటువంటి ఘటనలకు తావులేకుండా చర్యలు తీసుకోవాలని షాపుల యజమానులు కోరుతున్నారు. ఈ చోరీలో రెండు, మూడు షాపుల్లో నగదు భద్రపరుచుకునే సొరుగులు బద్దలగొట్టి నగదు చోరీ చేసినట్లుగా షాప్ యజమానులు వాపోతున్నారు. షాపు యాజమాన్యం ఇచ్చిన ఫిర్యాదులతో తుని పట్టణ పోలీసులు చోరీ జరిగిన ప్రాంతాలను పరిశీలించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌బాబు తెలిపారు.

మండపేట, మారేడుబాక దేవాలయాల్లో హుండీల చోరీ

మండపేట, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండపేట పట్టణంలో బుధవారం తెల్లవారుజామున దొంగలు రెచ్చిపోయారు. దేవాలయాల్లో హుండీలే లక్ష్యంగా ఎకకాలంలో మూడు దేవాలయాల్లో హుండీలను బద్దలు గొట్టి దోచుకుపోయారు. పట్టణంలో రథంగుడిసెంటరులోవున్న ఆంజనేయస్వామివారి భారీ విగ్రహం వద్దవున్న హుండీని దొంగలు బద్దలుగొట్టి అందులో వున్న నగదును దోచుకుపోయాడు. ఈ సంఘటన స్థానిక సీసీ ఫుటేజ్‌లో నమోదైంది. బుధవారం అర్ధరాత్రి రెండుగంటల సమయంలో చోరీ జరిగినట్టు నమోదైంది. ఈ చోరీ చేసిన వ్యక్తి మంకీ క్యాప్ ధరించి టూవీలర్‌పై వచ్చి చోరీకి పాల్పడినట్టుగా సీసీ ఫుటేజీలో నమోదైందని ఆలయ నిర్వాహకులు చెబుతున్నారు. ఆ హుండీలలో రూ.20వేలకుపైగా నగదు ఉండవచ్చని భావిస్తున్నారు. ఇదే అంశంపై ఆలయ నిర్వాహకులు పట్టణ పోలీసులకు బుధవారం ఫిర్యాదుచేశారు. పట్టణ సీ.ఐ డి.సురేష్ సంఘటనా స్థలానికి సిబ్బంది వచ్చి ఆరా తీశారు. మండలంలోని మారేడుబాకలో వున్న వినాయకుడుగుడి, రామాలయంలో దొంగ లుపడి హుండీల్లో నగదును దోచుకుపోయారని ఆలయాల నిర్వాహకులు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఒకేరోజు మూడుచోట్ల వేర్వేరుగా చోరీలు జరగ టం ప్రజల్లో ఆందోళన కలుగుతుంది. గంజాయికి అలవాటు పడిన వ్యక్తులే ఈతరహ చోరీలకు పాల్పడ వచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మండపేట ఆంజనేయస్వామి హుండీ చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న పట్టణ సీఐ సురేష్

మోటారు సైకిళ్ల డిక్కీలే లక్ష్యంగా..

● చోరీలకు పాల్పడుతున్న ముఠాలో వ్యక్తి అరెస్టు

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మోటారుసైకిళ్ల డిక్కీలనే లక్ష్యంగా చేసుకుని నగదు దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాలో ఒక వ్యక్తిని బుధవారం అరెస్టు చేసినట్టు డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్, పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. డిక్కీ ఉన్న మోటారుసైకిళ్లను లక్ష్యంగా చేసుకుని సంబంధిత యజమానులు తిరిగే ప్రాంతాల్లో రెక్కీలు నిర్వహిస్తూ చాకచక్యంగా పట్టపగలే డిక్కీలను తెరిచి చోరీలకు పాల్పడుతూ మోటారు సైకిళ్లపై ఇద్దరు వ్యక్తులు పరారవుతున్నట్టు సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా గుర్తించినట్టు సీఐ తెలిపారు. ఈనెల 4న పేరూరు భారత్ పెట్రోలు బంకు సమీపంలో టిఫిన్ సెంటర్‌వద్ద మోటారు సైకిల్ పెట్టి అల్పాహారం చేసేందుకు వెళ్లారు. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు పట్టపగలు డిక్కీని తెలిపి అందులో ఉన్న రూ.1.50 లక్షల నగదును అపహరించుకుని మోటారు సైకిల్‌పై పరారయ్యారు. అప్పట్లో పట్టణ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదుచేసి సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ కేసులో ఒక నిందితుడిగా ఉన్న విజయనగరంజిల్లా కొత్తవలస మండలం చీడివలస పంచాయతీకి చెందిన మేకల బాలరాజు(33)ను బుధవారం అరెస్టుచేసి అతనివద్ద నుంచి మూడు కేసుల్లో రూ.1.77లక్షల నగదుతోపాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు. బాలరాజుపై రావులపాలెం పోలీసుస్టేషన్ పరిధిలో రెండు కేసులు ఉన్నాయి. ముఠాలో మరో వ్యక్తి పరారీలో ఉన్నాడని, వీరు ఇరువురు విజయనగరం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పలు మోటారు సైకిళ్ల దొంగతనాలకు పాల్పడగా పలు పోలీసుస్టేషన్లలో వీరిపై కేసు నమోదై ఉన్నాయి. బాలరాజును అమలాపురం ఏజీఎఫ్‌సీఎం కోర్టులో హాజరుపరుచగా 14 రోజులు రిమాండు విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు పంపించామన్నారు. అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో సీఐ పి.వీరబాబు, ఎస్‌ఐ టి.తిరుమలరావు దర్యాప్తుచేశారు. ఇద్దరు నిందితులపై తెలంగాణలో పలు కేసులు నమోదయ్యాయి.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతిచెందిన చల్లా సత్యనారాయణ

గండేపల్లి, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలంలో నీలాద్రిరావుపేట జాతీయరహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మల్లేపల్లి గ్రామానికి చెందిన చల్లా సత్యనారాయణ(35) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల సమాచారం ప్రకారం సత్యనారాయణ రాజమహేంద్రవరం వైపు నుంచి జగ్గంపేటవైపు మోటార్ సైకిల్‌పై తన స్నేహితుడితో వెళుతుండగా నీలాద్రిరావుపేట గ్రామం వచ్చేసరికి వెనుక వస్తున్న కారు బలంగా ఢీకొట్టింది. దీంతో సత్యనారాయణ తలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందగా స్నేహితుడు దుర్గారావుకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి సత్యనారాయణ మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టంకు తరలించి కేసు నమో దుచేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యనారాయణకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఇంటిని పోషించే వ్యక్తి మృతి చెందడంతో కుటుంబం రోడ్డున పడిందని కుటుంబీకులు రోధిస్తున్నారు.

చికిత్సపొందుతూ తల్లి, కుమారుడు మృతి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం లొల్ల గ్రామంలో ప్రమాదవశాత్తూ పెట్రోల్ మంటలు చేలరేగి నిప్పు అంటుకుని తీవ్రగాయాలతో చికిత్స పొందుతున్న తల్లి, కుమారుడు మృతి చెందారు. ఈసంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలాఉన్నాయి. లొల్ల గ్రామానికి చెందిన చి ట్టూరి లక్ష్మీకాంతం(54), ఈనెల 14న రాత్రి 9గంటల సమయంలో తన కిరాణాషాపులో ఉన్న పెట్రోలు కింద ప డి మంటలు ఏర్పడటంతో ఆమె తీవ్రంగా గాయపడగా, అదే సమయంలో అక్కడే ఉన్న పెద్దకుమారుడు సాయికృష్ణ మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా గాయపడ్డాడు. ఇద్దరినీ రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించా రు. మంగళవారంరాత్రి పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ లక్ష్మీకాంతం మృతి చెందారు. సాయికృష్ణ పరిస్థితి విషమంగా మారడంతో బుధవారంరాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాము తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాట్రేనికోన, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ 5ఎంవీఏ నుంచి 8ఎంవీఏకు మార్పు చేస్తున్నట్టు అమలాపురం ట్రాన్స్‌కో ఈఈ కె.రాంబాబు బుధవారం తెలిపారు. శుక్రవారం ఉదయం 9నుంచి రాత్రి 7 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు సరఫరా ఉండదన్నారు.

రక్షిత తాగునీరు అందిస్తాం

అంబాజీపేట,ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి):వేసవిలో ప్రజలకు ట్యాంకర్ల ద్వారా రక్షిత మంచినీటిని అందిస్తామని సర్పంచ్ మట్టపర్తి నాగరాజు అన్నారు. పసుపల్లి పంచాయతీలో ట్యాంకర్ల ద్వారా మంచినీటిని అందించారు. పెట్టావారిపేట, మల్లిపూడివారిపేట, వక్కలంకలో తాగునీటిని అందిస్తామని కార్యదర్శి ఎల్.గణేష్ తెలిపారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణలో అలసత్వం వద్దు

● పది పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు ముద్వా రామలింగం

ముమ్మిడివరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి పొరపాట్లకు తావివ్వకుండా సమర్థవంతంగా నిర్వహించాలని పది పరీక్షల రాష్ట్ర పరిశీలకుడు ముద్వా రామలింగం పేర్కొన్నారు. ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల సమావేశ మందిరంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా అధ్యక్షతన బుధవారం పదో తరగతి పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంట్ అధికారులకు నిర్వహించిన సమావేశంలో రామలింగం ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పది పరీక్షల నిర్వహణలో ఎటువంటి అలసత్వం వహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పరీక్షల నిర్వహణలో చిన్నచిన్న పొరపాట్లు కూడా సందర్భాన్ని బట్టి సెన్సిటివ్‌గా మారే అవకాశం ఉన్నందున ప్రతీ విషయాన్ని సీరియస్‌గా పరిగణించాలన్నారు. పరీక్షలను పూర్తి పారదర్శకంగా మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ పరీక్షాపేపరుపై ప్రత్యేకంగా నంబరును ముద్రిస్తున్నందున లీకేజ్ ఎక్కడ జరిగినా, ఏ పరీక్షా కేంద్రం నుంచి లీకైందో వెంటనే తెలుస్తుందన్నారు. ప్రతీ పరీక్షా కేంద్రంలో తాగునీరు, విద్యుత్ సదుపాయం కల్పించాలన్నారు. డీఈవో షేక్ సలీంబాషా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షలకు జిల్లాలో 110 కేంద్రాలు ఏర్పాటు చేశామని, 19,227మంది విద్యార్థులు పరీక్షలు రాస్తారని తెలిపారు. అమలాపురం ఎంజీ మున్సిపల్ హైస్కూలు హెచ్‌ఎం బి.కామేశ్వరరావు మాట్లాడుతూ పది పరీక్షలు నిర్వహించే విధానంపై సీఎస్‌లు, డీవోలకు వివరించారు. ఈసందర్భంగా పది పరీక్షల ప్రత్యేకాధికారి రామలింగం పాఠశాల స్థాయి గురువు రొక్కాల తాతారావును దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే ఫిజిక్స్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సైన్స్ వారోత్సవాల పోస్టర్‌ను రామలింగం, డీఈవో సలీం బాషా ఆవిష్కరించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ బి.హనుమంతరావు, అమలాపురం, రామచంద్రపురం డీవైఈవోలు జి.సూర్యప్రకాశరావు, పి.రామలక్ష్మణమూర్తి, కార్యాలయ ఏడీ నక్కా సురేష్, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు బీవీవీ సుబ్రహ్మణ్య, పి.రాంబాబు, ఏవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు.


సైన్స్ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పదో తరగతి పరీక్షల పరిశీలకుడు రామలింగం, డీఈవో సలీంబాషా

కూటమి అభ్యర్థి రాజశేఖర్ విజయానికి కృషి చేయాలి

పలు చోట్ల ప్రచారం

అయినవిల్లి, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటువేసి అఖండ మెజారిటీతో గెలిపించాలని అమలాపురం పార్లమెంటు సభ్యుడు గంటి హరీష్‌మాధుర్, పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణలు పట్టభద్రుల ఓటర్లను కోరారు. బుధవారం పొట్టిలంక, కొండుకుదురు, ఎస్.మూలపొలం, శానపల్లిలంక, తొత్తరమూడి గ్రామాల్లో పట్టభద్రుల ఓటర్లను కలిసి ఓటు అభ్యర్థించారు. ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, షేక్ సుభాన్, రెడ్డి అనంతకుమారి, మద్దాల సుబ్బారావు, చిట్టూరి శ్రీనివాస్, పోలిశెట్టి రాజేష్, జంగా డేవిడ్‌రాజు, బొబ్బా ప్రభారత్‌కుమార్, సయ్యపరాజు సత్యనారాయణరాజు, కళ్లేపల్లి సుబ్బరాజు, వారా లక్ష్మీనరసింహరామ్, బడుగు భాస్కరజోగేష్, ర్యాలి శ్రీనివాసరావుపాల్గొన్నారు.


అయినవిల్లి: ఓటర్లకు ఎమ్మెల్సీ ఎన్నికల బ్రోచర్లు పంపిణీ చేస్తున్న ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే సత్యనారాయణ


ముమ్మిడివరం: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, జనసేన నాయకుడు బండారు శ్రీనివాస్

నరేంద్రపురంలో ప్రచారం

పి.గన్నవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి కృషి చేయాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి నక్కా సునీల్‌రాజు కోరారు. నరేంద్రపురంలోని గురుకుల పాఠశాల, శ్రీసుబ్రహ్మణ్య జడ్పీ ఉన్నత పాఠశాల, ఆక్స్‌ఫర్డ్ స్కూల్‌లో ఉపాధ్యాయులను కలిసి ఓటు అభ్యర్థించారు. మంద రాజేష్, నిమ్మకాయల శేషు, యల్లమిల్లి నాగేంద్ర, టీఎన్ఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల ప్రచారం

అల్లవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ ఘన విజయం ఖాయమని టీడీపీ నేత దెందుకూరి సత్తిబాబురాజు అన్నారు. రాజశేఖర్‌కు మద్దతుగా పట్టభద్రుల ఓటర్లను, ఎంపీడీవో డీఎస్ఎస్ కృష్ణమోహన్‌ను, ఉద్యోగులను టీడీపీ, జనసేన నాయకులు కలిసి ఓట్లు అభ్యర్థించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, కంకిపాటి వీరబాబు, బండి గుప్తాపు సత్తిబాబు, జంగా బుజ్జి, దాసం శేషగిరి, మామిడిశెట్టి శ్రీరామ్, మంతెన సురేష్‌రాజు, రాసూరి రాంబాబు, బొక్కా నాగశివప్రసాద్ ప్రచారం చేశారు.

పట్టభద్రుల ఓట్లు అభ్యర్థన

ఉప్పలగుప్తం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి తరఫున పోటీలో ఉన్న పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యతా ఓటు వేసి ఘన విజయం చేకూర్చాలంటూ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం గ్రాడ్యుయేట్లకు విజ్ఞప్తి చేశారు. బుధవారం భీమనపల్లి, సూదాపాలెం, భట్టుపాలెం గ్రామాల్లో ఆయన గ్రాడ్యుయేట్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఆయనతో పాటు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు మంచెం బుజ్జి, శీలం భాస్కరరావు, మాజీ ఎంపీటీసీ పెయ్యల తిరుమలరావు, రామకోటి పాల్గొన్నారు.

ప్రతి ఓటరును కలవాలి

ఐ.పోలవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): బూత్ ఇన్‌చార్జులు ప్రతి గ్రాడ్యుయేట్ ఓటర్నీ కలిసి కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించేలా కృషి చేయాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పిలుపునిచ్చారు. ఐ.పోలవరంలో బుధవారం బూత్ ఇన్‌చార్జులకు శిక్షణా కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే, ఎన్నికల పరిశీలకులు కోటేశ్వరరావు, కాలా సత్తిబాబు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, టీడీపీ మండల అధ్యక్షుడు రాయపురెడ్డి నీలకంఠేశ్వరరావు, సాగిరాజు సూరిబాబురాజు, కాకర్లపూడి రాజేష్, మురమళ్ళ డీసీ చిలువూరి సుబ్బరాజు, ముదునూరి రామలింగరాజు, గంజా సుధాకర్, సాకా సీతాదేవి, నీటిసంఘం అధ్యక్షుడు చోడిశెట్టి నాగబాబు, వనచర్ల వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పలు వార్డుల్లో ప్రచారం

అమలాపురం టౌన్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరుతూ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. కూటమి నాయకులు తిక్కిరెడ్డి నేతాజీ, యేడిద శ్రీను, పెచ్చెట్టి విజయలక్ష్మి, మాకిరెడ్డి వీఎన్ఎస్ పూర్ణిమ, బత్తుల సాయి, వలవల శివరావు పాల్గొన్నారు.

అంతర్వేదిలో ప్రచారం

అంతర్వేది, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా గొంది, అంతర్వేది పల్లిపాలెం, అంతర్వేది దేవస్థానం, అంతర్వేది గ్రామాల్లో కూటమి నాయకులతో కలిసి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ప్రచారం నిర్వహించారు. రాజశేఖర్‌ను గెలిపించాలని కోరారు. మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, గెద్దం మహాలక్ష్మి

ప్రసాద్, ముప్పర్తి నాని, గుబ్బల ఫణికుమార్, చాగంటి స్వామి, చిటికెల రామ్మోహనరావు, గుబ్బల శ్రీనివాస్, రావూరి నాగు, తిరుమాని ఆచార్యులు భూపతిరాజు సాయిబాబురాజు, చెల్లుబోయిన శ్రీనివాస్, పోతాబత్తుల రాంబాబు, దాసరి వాసు, పోతురాజు వెంకటరత్నంపాల్గొన్నారు.

ప్రతి ఓటరును కలిసి మాట్లాడాలి

కాట్రేనికోన, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నాయకులు, ఇన్‌చార్జులు ఎన్నికల లోపు ప్రతి ఓటరును రెండు లేదా మూడు సార్లు కలిసి మాట్లాడాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా బుధవారం కాట్రేనికోనలో ముఖ్య నాయకులు, ఇన్‌చార్జులతో ఆయన సమావేశమయ్యారు. అనంతరం గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో నాగిడి నాగేశ్వరరావు, నడింపల్లి సుబ్బరాజు, ఆకాశం శ్రీనివాస్, కోటేశ్వరరావు, కాలా సత్తిబాబు, ఇసుకపట్ల వెంకటేశ్వరరావు, వెంట్రు సుధీర్, బాలప్రసాద్, మట్టా సూరిబాబు, దత్తుడు, విత్తనాల రమణ, చెల్లి సురేష్, త్సవటపల్లి నాగు, జంగా శ్రీనివాస్, సూదా బాబూరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థిని గెలిపించాలి

ముమ్మిడివరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయానికి అధ్యాపకులు, గ్రాడ్యుయేట్లు మొదటి ప్రాధాన్యతా ఓటేసి గెలిపించాలని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు కోరారు. బుధవారం ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని శ్రీకృష్ణదేవరాయ మహిళా డిగ్రీ కళాశాల, సర్ రావూబహదూర్ రఘుపతి వెంకటరత్నంనాయుడు మహిళా కళాశాల, శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలల్లో జనసేన పార్టీ జిల్లా పరిశీలకులు బండారు శ్రీనివాస్, కూటమి నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఎస్సీకార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ చెల్లి అశోక్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, దొమ్మేటి రమణకుమార్, ఎస్సీసెల్ అధ్యక్షుడు పొద్దోకు నారాయణరావు, చిక్కాల అంజిబాబు, గొల్లపల్లి గోపి, గుద్దటి జమ్మి, గోదశి పుండరీష్, దాట్ల బాబు, యాళ్ల ఉదయ్, ఎన్నికల పరిశీలకుడు కాలా సత్తిబాబు, ముత్యాల జయలక్ష్మి పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల నిరసన


నిరసన తెలుపుతున్న పారిశుధ్య కార్మికులు

ముమ్మిడివరం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): ఆప్కాస్ (ప్రభుత్వ అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్) రద్దు చేయాలని, మంత్రివర్గ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ముమ్మిడివరం నగరపంచాయతీ పారిశుధ్య కార్మికులు బుధవారం భోజన విరామ సమయంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నగరపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈసందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ మంత్రిమండలి అవుట్ సోర్సింగ్ కార్పొరేషన్ రద్దుపై నిర్ణయం తీసుకోవడం దారుణమన్నారు. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పజెప్పాలనే నిర్ణయం సరికాదన్నారు. ప్రభుత్వం తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకపోతే దశలవారీ ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నక్కా అరుణ్‌కుమార్, నిమ్మకాయల వెంకటేష్, పలివెల రాంబాబు, బుంగా కుమార్ స్వామి, మోర్త భార్గవ్, పలివెల నాగలక్ష్మి, రేవు వెంకటలక్ష్మి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

34 టీమ్‌లతో రీసర్వే: ఆర్డీవో

మామిడికుదురు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అమలాపురం రెవెన్యూ డివిజన్ పరిధిలో 34 టీమ్‌లతో తొమ్మిది గ్రామాల్లో రీసర్వే చేస్తున్నామని ఆర్డీవో కె.మాధవి తెలిపారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆర్డీవో, వీఆర్వోలు, విలేజ్ సర్వెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇంత వరకు మ్యూటేషన్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, వాటిలో పూర్తి చేసినవి ఎన్ని, తిరస్కరించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మ్యూటేషన్ కోసం వచ్చిన దరఖాస్తులను నిర్ణీత సమయంలో పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశాలిచ్చారు. అనంతరం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ రీసర్వే కోసం గ్రామాల్లో సరిహద్దులు నిర్ధారించి ప్రభుత్వ ప్రైవేటు భూములను గుర్తిస్తున్నామని తెలియచేశారు. తొమ్మిది గ్రామాలకు 15వేల ఎకరాల్లో రీసర్వే చేయాల్సి ఉందని, ఇంత వరకు 5 వేల ఎకరాల్లో రీసర్వే పూర్తి చేశామన్నారు. రైతులకు సమాచారం ఇచ్చి ఆయా రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో తహశీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యాచార్యులు, డిప్యూటీ తహశీల్దార్ కె.శరణ్య, ఆర్ఐ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు

రాజోలు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రబీ పంటకు నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. రాజోలు ఇరిగేషన్ కార్యాలయంలో రాజోలు నీటి సంఘం డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్‌గా పినిశెట్టి వెంకటస్వామి(బుజ్జి) బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వెంకటస్వామి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. రబీ పంటకు నీటి ఎద్దడి లేకుండా ప్రతిపాదించిన పనులను ఆమోదించుటకు ఉన్నతాధికారులకు తెలియచేయాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. తొలుత డీసీ చైర్మన్ బుజ్జిని, నీటి సంఘం అధ్యక్షులను పూలమాలలతో సత్కరించారు. గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, ఇరిగేషన్ ఈఈ బి.శ్రీనివాస్, డీఈఈ ఆర్.నాగేంద్రకుమార్, రాజోలు ఏఈ బి.రమేష్‌బాబు, రాజోలు డ్రైనేజీ ఈఈ కిశోర్, డీఈఈ ఆర్.నాగార్జున, జేఈఈలు ఆనంద్‌కుమార్, రేష్మ పాల్గొన్నారు.

వేంకన్న ఆలయ పనుల పరిశీలన

యానాం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): యానాంలో తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో పునఃనిర్మాణం జరుగుతున్న యానాం శ్రీభూసమేత వెంకటేశ్వరస్వామి) మీసాల వెంకన్న ఆలయ పునఃనిర్మాణ పనులను తిరుపతి నుంచి వచ్చిన ఇంజనీరింగ్ విభాగం అధికారులు పరిశీలించారు. తొలి విడత రూ.6కోట్లతో ఆలయ నిర్మాణం జరుగుతోంది. వీటిలో టీటీడీ దేవస్థానం నుంచి వచ్చిన రూ.3కోట్లు, యానాం, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తుల విరాళం రూ.3కోట్లతో పూర్తిగా రాతితో నిర్మాణం జరుగుతోంది. పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధిమల్లాడి కృష్ణారావు పర్యవేక్షణలో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. మొదటి విడతలో ఇప్పటివరకు జరిగిన పనులను, ఇంకా జరగాల్సిన పనులను టీటీడీ నుంచి వచ్చిన ఇంజనీరింగ్ ఎస్ఈ జగదీశ్వర్‌రెడ్డి, ఈఈ సురేంద్రనాథ్, స్థపతి కృష్ణారావు, ఎలక్ట్రికల్ ఈఈ రవిశంకర్ రెడ్డి పరిశీలించారు. అనంతరం మల్లాడితో పాటు ఆలయ పునఃనిర్మాణ కమిటీ ప్రతినిధులు, అర్చకులతో సమావేశం నిర్వాహించారు. ముఖ్యంగా మొదటి విడత పనులు పూర్తిచేయడంతో పాటు రెండో విడతలో చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఆలయ ఈవో ఖండవల్లి రామకృష్ణ, పునఃనిర్మాణ ప్రతినిధులు కాపగంటి ఉమశంకర్, గుత్తుల గోవింద జయరామారావు, మంచాల సత్యసాయికుమార్ పాల్గొన్నారు.


ఆలయ పనులపై చర్చిస్తున్న దృశ్యం

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

యానాం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సమస్యలు పరిష్కారం కోరుతూ యానాంలో విద్యుత్ ఉద్యోగులు ఆందోళన చేపట్టారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ యానాంలో కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. విద్యుత్‌శాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, విద్యుత్ ఉద్యోగుల పనిభారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏఈ ఎం.సత్యనారాయణమూర్తి, జేఈ లంక నక్షత్రం, సిబ్బది పురుషోత్తం, సింహాద్రి, పంపన శ్రీను, కోనా శ్రీను, శంకర్‌రెడ్డి, పెసింగిదాసు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి

అంతర్వేది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిస్థానం 16 స్తంభాల మండపం వద్ద ఛత్రపతి శివాజీమహారాజ్ జయంతి వేడుకలను లక్ష్మీనరసింహ యువత ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. శివాజీమహారాజ్ విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎంపీటీసీ బైరా నాగరాజు, శంకరగుప్తం నాని, పోతురాజు సురేష్, నరసింహ, నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, లక్ష్మీనరసింహ పాల్గొన్నారు.

25లోగా భూ ఆధార్ చేయించుకోవాలి

అంతర్వేది, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లి మండలంలో ప్రతీ రైతు ఫిబ్రవరి 25 వతేదీ లోపు భూ ఆధార్ చేయించుకోవాలని రైతులను వ్యవసాయాధికారి వీవీ నరసింహారావు కోరారు. అప్పనరామునిలంక గ్రామంలో రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి కోనసీమ జిల్లా వ్యవసాయాధికారి వి.బోసు బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవసాయ పథకాలకు సరైన లబ్ధిదారులను గుర్తించి పథకాలు వర్తింప చేసేందుకు భూ ఆధార్ అనే కార్యక్రమం తీసుకురానున్నట్లు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం సమన్వయంతో వ్యవసాయశాఖ చేపడుతున్న బృహత్తర కార్యక్రమం రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు కార్యక్రమమని తెలిపారు. ఈపథకం ద్వారా పీఎం కిసాన్ చెల్లింపు పెట్టుబడి సాయం, పంటల బీమా, అన్నదాన సుఖీభవ, యాంత్రీకరణ పరికరాలు, పంటరుణాలు, వడ్డీ రాయితీ మొదలగు ప్రయోజనాలు పొందవచ్చన్నారు. ప్రతీ రైతు తన ఆధార్‌కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన ఫోన్ నంబరు, పట్టాదారు పాసు పుస్తకం నకలు తీసుకుని రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించాలన్నారు. రాజోలు ఇన్‌చార్జి ఏడీఏ రామ్మోహనరావు, స్థానిక వ్యవసాయాధికారి పీవీ నరసింహారావు, రైతులు, సర్పంచ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారం

పి.గన్నవరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాకు ఓటు వేసి గెలిపించాలని మండలానికి చెందిన కాండ్రేగుల నరసింహం తన కుమార్తెలతో కలిసి గంటి పెదపూడి, ఉడిమూడి తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ



ప్రతిభ చాటిన విద్యార్థులు

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఇంటర్‌స్టేట్ కరాటే చాంపియన్ షిప్-2025 పోటీలు కాకినాడ ద్రోణ బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహించగా సమనస ఢిల్లీ పబ్లిక్ స్కూలు విద్యార్థులు అద్భుత ప్రతిభ చాటి పతకాలు సాధించినట్టు కోచ్ పడాల అంజి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పాఠశాలలకు చెందిన 650మంది విద్యార్థులు ఈపోటీల్లో పాల్గొన్నారు. వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ఢిల్లీ పబ్లిక్ స్కూలుకు చెందిన 24మంది విద్యార్థులు స్వర్ణ పతకాలు, 30మంది రజత పతకాలు సాధించడంతో పాటు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్లు నంద్యాల మనువిహార్, స్నేహప్రియ, ప్రిన్సిపాల్ దేవీదీక్షిత్, ఉపాధ్యాయులు అభినందించారు.

శ్మశానవాటికలో శివుని విగ్రహ స్థాపన

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ముక్తిధామ్ ట్రస్టు ఆధ్వర్యంలో బండారులంక హిందూ శ్మశాన వాటికలో పరమశివుని విగ్రహాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. ఇప్పటికే గ్రామస్తుల సహకారంతో శ్మశానవాటికను సుందరీకరణ చేయడంతో పాటు వివిధ రకాల సదుపాయాలను కల్పించారు. ప్రధానంగా విశ్రాంతి మందిరం, నీటి సదుపాయం, ప్రహరీ, కుర్చీల ఏర్పాటు వంటివి చేశారు. ముక్తిధామ్ ట్రస్టు ఆధ్వర్యంలో శ్మశానవాటిక చుట్టూ మొక్కలను పెంచుతున్నట్టు పర్యవేక్షకులు బళ్ల స్వామివివేకానంద, కొండా బ్రహ్మానందం తెలిపారు.

శ్రీరాజశ్యామలా సహిత శ్రీవనదుర్గా మహావిద్యా యాగం

పి.గన్నవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): నరేంద్రపురంలో శ్రీరాజశ్యామలా పరదేవతా సహిత శ్రీవన దుర్గా మహావిద్యాయాగం రాంపల్లి సుబ్రహ్మణ్య ప్రసాదశర్మ బ్రహ్మత్వంలో శ్రీసర్వజ్ఞ భారతీ ఆధ్యాత్మిక కేంద్రం ఆధ్వర్యంలో గోరుగంతు చంద్రుడు కుటుంబ సభ్యులతో బుధవారం వైభవంగా ప్రారంభమైంది. మొదటి రోజు గ్రామ ప్రదక్షణ, గ్రామదేవతార్చన, గోపూజ, యాగశాల ప్రదక్షణ, వాస్తు హోమం, అఖండ దీపారాధన తదితర పూజా కార్యక్రమాలు చేశారు. మధ్యాహ్నం అగ్నిప్రతిష్ఠాపన, మూలమంత్ర హవనమాలు కార్యక్రమాలు నిర్వహించారు.

ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్



పి.గన్నవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఆర్య వైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ముంగండ గ్రామానికి చెందిన పెంటపాటి శ్రీనివాస్ ఎన్నికయ్యారు. అన్నవరంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా కంచర్ల బాబితో పాటు ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్‌ను నియమించారు. అలాగే మండలానికి చెందిన తమ్మన ప్రసాద్, కొల్లా శ్రీనివాస్, బొడ్డు గోపాలకృష్ణ, జల్లూరి సాయికృష్ణలు కార్యవర్గ సభ్యులుగా, వధూవరుల పరిచయ వేదిక కన్వీనర్‌గా శ్రీఖాకుళపు లక్ష్మీపతిరావు, మహిళ విభాగం ఉపాధ్యక్షురాలుగా బొడ్డు సునీత నియమితులయ్యారు. శ్రీనివాస్‌తో పాటు నూతన కార్యవర్గానికి పాటోలు కృష్ణమూర్తి, బొడ్డు వెంకటసతీష్, బొడ్డు బదరినారాయణ, జల్లూరి నాగేశ్వరగుప్తా అభినందనలు తెలిపారు.

సత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు ప్రారంభం



ముమ్మిడివరం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం మండలం సీహెచ్ గున్నేపల్లిలోని శ్రీసత్తెమ్మతల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు బుధవారం నుంచి అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. బుధవారం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని నెలకొల్పి ప్రత్యేక పూజలు జరిపించారు. ఆలయ ప్రాంగణమంతా కనులు మిరుమిట్లుగొలిపే విద్యుద్దీపాలతో అలంకరించారు. భారీ ఎత్తున స్వాగత ద్వారాలు, వివిధ దేవతామూర్తుల ఆకృతులను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఈనెల23వరకు జరిగే అమ్మవారి జాతర మహోత్సవాల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. బుధవారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. బుధవారం రాత్రి కుమార్ ఈవెంట్స్ వారితో డి.మణికంఠ, తేజస్వినిల డ్యాన్స్ ప్రోగ్రాం, జబర్దస్త్ ఇమిటేషన్ రాజుతో కామెడీ షో వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

కోలాహలంగా వీరభద్రస్వామి సంబరం

మామిడికుదురు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వీరభద్రస్వామి సంబరాన్ని పెదపట్నంలంక గ్రామంలో భక్తుల కోలాహలం మధ్య బుధవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా బాణసంచా కాల్పులు, సన్నాయి వాయిద్యాలతో వైనతేయ నది వరకు స్వామివారిని ఊరేగించి అక్కడ నదీ స్నానమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన యేడిద గోపాల కృష్ణ-పద్మ దంపతుల ఆధ్వర్యంలో విఘ్నేశ్వరపూజ, శమీవృక్షం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వీరభద్రస్వామికి శూలాలతో వీరనాట్యం చేస్తూ పరవశించారు. అనంతరం జరిగిన భారీ అన్నసమారాధన, పూజా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దళిత హక్కుల పరిరక్షణకు నిరంతరం పోరాటం చేయాలి

మలికిపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): దళిత హక్కుల పరిరక్షణకు దళితులు నిరంతరం పోరాటం చేయాలని ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.సత్తిబాబు అన్నారు. బుధవారం మలికిపురం పూలే-అంబేడ్కర్ భవన్‌లో దేవ రాజేంద్రప్రసాద్ అధ్యక్షతన జరిగిన దళిత హక్కుల పోరాట సమితి సమావేశంలో సత్తిబాబు మాట్లాడారు. భారత రాజ్యాంగ వ్యవస్థలను నిర్వీర్యం చేసి దళితుల హక్కులకు భంగం కలిగించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫల యత్నాలు చేస్తున్నాయన్నారు. సమావేశంలో దేవ రాజేంద్రప్రసాద్, రాపాక పవన్‌కుమార్, బత్తుల మురళీకృష్ణ, చింతా రాజబాబు, గెడ్డం ప్రభాకర్, నల్లి శివ, జిల్లెల్ల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు



అమలాపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి వనుము సోమశేఖరరావు తెలిపారు. ఈనెల1నుంచి ఇంటర్ ఒకేషనల్ విద్యార్థులకు, 10నుంచి జనరల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమై ప్రశాంతంగా ముగిశాయన్నారు. మార్చి 1 నుంచి 20వరకు 40పరీక్షా కేంద్రాల్లో థియరీ పరీక్షలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేపట్టామన్నారు. కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాలతో ఏర్పాట్లు చేస్తున్నామని, అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకుని ముందుకు సాగుతున్నామన్నారు. ఈనెల23న పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లు, కస్టోడియన్స్, స్క్వాడ్ మెంబర్లకు అమలాపురం ప్రభుత్వబాలికల జూనియర్ కళాశాలలో సమావేశం నిర్వహిస్తామన్నారు.

బీజేపీ నూతన కార్యాలయం ప్రారంభం

పి.గన్నవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరంలో బీజేపీ నూతన పార్టీ కార్యాలయాన్ని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ మండల అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు అధ్యక్షతన జరిగిన ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకల్లో భాగంగా శివాజీ చిత్రపటానికి పూలమాలలువేసి ఘనంగా నివాళులర్పించారు. అదే విధంగా స్థానిక ఐటీఐ కళాశాలలో జరుగుతున్న ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన ట్రైనింగ్ సెంటర్‌ను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు ఆరుమిల్లి వీరభద్రరావు, చీకరమిల్లి శ్రీనివాసరావు, అడ్డాల వెంకటేశ్వరావు, కంకిపాటి సుబ్బారావు, సూర్యనారాయణ, గోపాలకృష్ణ, ఎం.సత్యనారాయణ, శివాజీ, సుబ్రహ్మణ్యం, సాయిబాబు, పితాని వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు నైపుణ్య శిక్షణ

మామిడికుదురు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జ్ఞానజ్యోతి కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీలకు నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఆరు రోజులు నిర్వహిస్తున్నామని పి.గన్నవరం ఐసీడీఎస్ సీడీపీవో వై.విజయశ్రీ కోరారు. మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న శిక్షణ తరగతులను ఆమె పరిశీలించి అనంతరం మాట్లాడారు. నైపుణ్య శిక్షణ ద్వారా ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు బోధించే జ్ఞానజ్యోతి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మోకా వెంకన్నబాబు, హెచ్‌ఎం సీహెచ్ నిరంజని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పి.విజయలత, పి.అన్నపూర్ణ, సుబ్బలక్ష్మి, డీఆర్పీలు తోట వెంకటేశ్వరరావు, వై.పల్లంరాజు పాల్గొన్నారు.

గుణాత్మక విద్యను అందించాలి

అంబాజీపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీల్లో చిన్నారులకు గుణాత్మక విద్య అందించాలని సీడీపీవో వై.విజయశ్రీ సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో అంగన్‌వాడీ టీచర్లకు జ్ఞానజ్యోతిపై శిక్షణ కార్యక్రమం రెండో రోజు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ మండలంలో ఉన్న అంగన్‌వాడీ టీచర్లకు చైల్డ్ డెవలెప్‌మెంట్ స్కూల్ రెసిడెన్స్, గుణాత్మక విద్య విద్యార్థుల్లో పెంపొందించే దిశగా ఆరు రోజులు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. సపోర్టింగ్ ఆంధ్రా లెర్నింగ్ ట్రాన్సఫర్మేషన్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాన్ని డీఆర్పీలు సీహెచ్ వెంకటసతీష్, బీఆర్ఎల్ శ్రీనివాస్, డీఎస్ రమేష్ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వీఎస్వీ మహాలక్ష్మి, ఎన్.వెర్నమ్మలు పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

ఐ.పోలవరం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మురమళ్ళ శ్రీభద్రకాళీసమేతవీరేశ్వరస్వామి మహాశివరాత్రి ఏర్పాట్లపై ఆలయ సహాయ కమిషనర్ మాచిరాజు లక్ష్మీనారాయణ బుధవారం ఆలయ అర్చకులు, పురోహితులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనెల26 నుంచి మార్చి2వరకు మహాశివరాత్రి ఉత్సవాలు జరగనున్నాయి. ఈఏడాది ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్టు ఏసీ తెలిపారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా అవసరమైన ఏర్పాట్లుచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు, పిల్లలకు పాలు, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పర్యవేక్షకుడు కటారి శ్రీనివాసరాజు, అర్చకులు యనమండ్ర సుబ్బారావు, యనమండ్ర సత్యసీతారామశర్మ, పేటేటి శ్యామలకుమార్, పురోహితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి, వేదపండితుడు పాల్గొన్నారు.

'నిరుపేదలకు దానియేలు సాయం చేశారు'


దానియేలు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, అభిమానులు

పి.గన్నవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పెదకందాలపాలెం న్యూజెరూషలేం మినిస్ట్రీస్ అధినేత పాస్టర్ జి.దానియేలు ఆపదలో ఉన్న నిరుపేదలకు సాయం చేసేవారని, ఆయన సేవలు మరువలేనివని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు కొనియాడారు. పెదకందాలపాలెం యెరూషలేం ప్రార్థనా మందిరంలో నిర్వహించిన పాస్టర్ జి.దానియేలు సంతాప సభలో ఆయన మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరిదేవి మాట్లాడుతూ దానియేలు చేసిన సామాజిక సేవలను వివరించారు. దానియేలు ఆకస్మిక మరణం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం దానియేలు స్థానాన్ని కుమారుడు ఫిలిప్‌గిరీష్ భర్తీచేసి సామాజిక సేవలను కొనసాగించాలని భారీ సంఖ్యలో హాజరైన అభిమానుల మధ్య ప్రకటించారు. పాస్టర్ దానియేలు ఫొటోను కార్యదర్శి యు.జాన్‌బాబు, ఆర్.సుధాకర్‌లు ఆవిష్కరించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాజకీయనాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణా కేంద్రం ప్రారంభం

మలికిపురం, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): మహిళల కోసం కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం ప్రశంసనీయమని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం గుడిమెళ్లంకలో కడలి సుభద్రా నరసింహమూర్తి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళల కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించడానికి ఇటువంటి శిక్షణలు తోడ్పడతాయన్నారు. రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాస్, కడలి బాబూరావు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెద్దకాపు, చెల్లించి సత్యనారాయణ, ముత్యాల దుర్గాదేవి, కాకి లక్ష్మణ్ పాల్గొన్నారు.

ఘనంగా స్వాతి నక్షత్ర పూజలు

అంతర్వేది, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్ర పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. తొలుత బంగారు కలశను అర్చకులు శిరస్సుపై ధరించి ఆలయ ప్రదక్షిణలు చేసి స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అష్టోత్తర కలశాభిషేకాలను ఆలయ పురాతన కల్యాణ మండపం వద్ద నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అష్టోత్తర శత కలశాభిషేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొమ్మిది బుధవారాలు తొమ్మిది ప్రదక్షిణలు చేసే భక్తులు స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

లారీ ఢీకొని గేదె మృతి

మామిడికుదురు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): పాశర్లపూడి కొండాలమ్మ చింతసెంటర్ వద్ద బుధవారం తెల్లవారుజామున లారీ ఢీకొనడంతో గేదె మృతిచెందింది. జాతీయ రహదారిపై వస్తున్న గేదెను లారీ ఢీకొట్టడంతో గేదె మృతిచెందగా దూడ తీవ్రంగా గాయపడిందని బాడిలంక గ్రామానికి చెందిన గేదె యజమాని అప్పన నాగన్న తెలిపాడు.

మండపేట

ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించండి

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ నియంత్రణకు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ అయ్యప్ప నాయుడు కోరారు. బుధవారం రామచంద్రపురం మున్సిపల్ కార్యాలయం లో హొటళ్లు, రెస్టారెంట్లు, టీ దుకాణాల యజమానులతో ఆయన సమావేశం జరిపారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడరాదని సూచించారు. టీ స్టాల్స్ యజమానులు గాజు గ్లాసులు లేదా పింగాణీ కప్పులు ఉపయోగించాలన్నారు. పట్టణంలో ప్లాస్టిక్ నియంత్రణకు ప్రజలతో పాటు ఆయా దుకాణదారులు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న కమిషనరు

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. మాఘమాసాన్ని పురస్కరించుకుని భక్త సంఘం ఆధ్వర్యంలో తొలుత స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, సుప్రభాతసేవ, అర్చనలు, తిరుమంజనం చేశారు. కల్యాణంలో భాగంగా విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, మాంగల్యపూజ, మధుపర్క సమర్పణ, యజ్ఞోపవీత ధారణ, మాంగల్యధారణ జరిపి స్వామి, అమ్మవార్ల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. కార్యక్రమంలో సుమారు 200 మంది దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్త సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గజవాహనంపై స్వామివారు..భక్తుల పులకింత

ఆలమూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): చింతలూరులో మూడోరోజు బుధవారం పలు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. స్వామి, అమ్మవార్లకు ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం భక్తులతో వేద పండితులు ప్రత్యేక పూజలు జరిపించారు. సాయంత్రం శ్రీవారిని గజవాహనంపై ఊరేగించారు. గజవాహనంపై స్వామివారిని మేళతాళాలు, డోలుసన్నాయిలతో ఊరేగింపు జరిపారు. భక్త మండలి భక్తి గీతాలు ఆలపించగా మహిళా భక్తులు కోలాటం చేసుకుంటూ సాగిన గజవాహన ఊరేగింపు ఆకట్టుకుంది. అనంతరం ఆరోగ్యతా సిద్ధి కోరకు ఆయుష్య హోమం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



స్వామివారిని ఊరేగిస్తున్న దృశ్యం

వాడపల్లి ఒకరోజు ఆదాయం రూ.1.89 లక్షలు



వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్నపనమూర్తులకు అభిషేకం చేస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన భక్తులు అష్టోత్తర పూజలు, నిత్య కల్యాణాలు జరిపారు. స్వామివారిని దర్శించుకున్న భక్త లు అన్నప్రసాదంలో పాల్గొన్నారు. వివిధ సేవల ద్వారా ఒకరోజు ఆదాయం రూ.1,89,108 వచ్చినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. అనంతరం లక్షతులసి పూజను నిర్వహించారు. స్నపనమూర్తులకు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు.

ఎమ్మెల్యే బండారు పూజలు: గోవిందమాలధరించిన దీక్షాదారులు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. కోనేటిరాయుని దర్శనంలో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పూజల్లో పాల్గొన్నారు.

మార్చి 5 నుంచి వెంకన్న వార్షిక బ్రహ్మోత్సవాలు

ఆత్రేయపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దశమ వార్షిక బ్రహ్మోత్సవాలు మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ పి.వెంకటసత్యనారాయణ రాజు తెలిపారు. ఐదు రోజులపాటు వీటిని వైభవంగా జరుపుతామన్నారు. తిరుమల తరహాలో శ్రీవారి వాహనోత్సవాలు నిర్వహిస్తామన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు పందిరిరాట ముహూర్తం జరిపి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కరపత్రాలను ఆవిష్కరించారు.

వినాయకుడి ఆలయానికి భూమిపూజ

కె.గంగవరం, ఫిబ్రవరి19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడ గ్రామంలో జీర్ణావస్థకు చేరుకున్న వినాయకుని ఆలయాన్ని పునర్నిర్మించడానికి బుధవారం భూమి పూజ చేశారు. గతంలో ఈ ఆలయాన్ని పామర్తి సుబ్బారాయుడు, సరస్వతి దంపతులు నిర్మించారు. ఇది జీర్ణావస్థకు చేరుకోవడంతో పామర్తి కుటుంబీకులు ఆలయం పునర్నిర్మించాలని నిర్ణయించారు. దీంతో రూ. 10లక్షలతో నిర్మాణం చేయడానికి బుధవారం భూమి పూజ చేశారు. డాక్టర్ పామర్తి పట్టాభి రామారావు, మహాలక్ష్మి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దలు పామర్తి ఆనందరాయుడు, బాబులు, బ్రహ్మానందం, సలాది వీరబాబు, తోట వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



ఆలయానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ మృత్యుంజయరావు

సర్వే రాళ్లపై పేర్ల తొలగింపు వేగవంతం చేయండి

కె.గంగవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో సర్వే రాళ్లపై వేసిన బొమ్మలు, పేర్ల తొలగింపును వేగవంతం చేయాలని తహశీల్దార్ బండి మృత్యుంజయ రావు అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విఆర్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయశాఖలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను, ఈక్రాప్‌ను పర్యవేక్షించాలని సూచించారు. రీసర్వే గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్‌లు మురళి, శ్రీరామ్‌ప్రసాద్, ఆర్ఐ వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థి దశలో ప్రాథమిక విద్య కీలకమైంది



భాష్యం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశలో ప్రాథమిక విద్య కీలకమైందని రాయవరం భాష్యం స్కూల్ ప్రిన్సిపాల్ పట్నాల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. బుధవారం రాయవరం భాష్యం స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో చిన్నారులను చదువుపై ఇష్టం కలిగే విధంగా బోధన చేస్తే విద్యార్థులు హైస్కూల్ స్థాయిలో వచ్చేసరికి చదువులో మరింత ముందుకు వెళ్తారన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల అభిరుచిన గుర్తించి వారిని ఆయా రంగాలవైపు ప్రోత్సహించాలన్నారు. విద్యతోనే సమాజాభివృద్ధి, దేశాభివృద్ధి సాధ్యమని విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా విద్యార్థిని, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. తొలుతగా యూకేజీ, 5వ తరగతి విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాష్యం లిటిల్ చాంప్స్ ప్రిన్సిపాల్ ఎం.కాంచన, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత బీమేశ్వరస్వామి అన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన కలిదిండి భాస్కరనారాయణ రాజు రూ.1,01116 విరాళం ఇచ్చారు. దాతలకు ఆలయ సీనియర్ సహాయకుడు సూరపురెడ్డి వెంకటేశ్వరరావు స్వామివారి చిత్రపటం, ప్రసాదం అందచేశారు.

సాగు నీరందక పంటచేలు బీటలు

• రైతుల ఆందోళన • సమస్య పరిష్కరించాలని ప్రభుత్వానికి వినతి

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రబీ వరిసాగుకు కష్టకాలం మొదలైంది. వేసవి ఆరంభంలోనే నీటిఎద్దడితో శివారు పొలాలకు సాగునీరు అందక రైతులు ఆందోళన చెందుతున్నారు. కపిలేశ్వరపురం మండలంలోని మాచర, నాగులచెరువు ఆయకట్టు పరిధిలోని పంట పొలాలకు నీరు అందడం లేదు. వాటి పరిధిలోని ఆయకట్టుకు నీరందించే ఛానల్ ద్వారా సాగునీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మాచర పంచాయతీ శివారు శ్రీరామపురం వద్ద బ్యాంక్ కెనాల్ నుంచి నాగులచెరువు వరకు సాగునీరు అందించే కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు, తుప్పలు, తూటుకాడలతో మూసుకుపోవడంతో పంటచేలకు నీరందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతుల వారీగా సాగునీరు అందిస్తున్న శివారు పొలాలకు నీరందక చేలు బీటలు తీస్తున్నాయని వాపోతున్నారు. సాగు ప్రారంభం నుంచి ఎకరాకు ఇప్పటికే రూ.25 వేలకు పైగా అప్పులు చేసి పెట్టుబడి పెట్టామని రైతులు ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం చేలకు ఎరువులు వేసే పరిస్థితి లేకుండాపోయిందన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే పంటలు చేతికందే అవకాశం లేకుండా పోతుందన్నారు. సాగునీరు ఎద్దడి లేకుండా ఉండేందుకు తాతపూడి పంపింగ్ స్కీం ద్వారా సాగునీరు అందించే అవకాశం ఉన్నప్పటికీ అది నిరుపయోగంగా మారడంతో ఆ అవకాశం లేకుండా పోయిందని రైతులు విమర్శిస్తున్నారు. కనీసం సమీపంలోని పంటకాలువ నుంచి మోటార్ల ద్వారా నీగునీటిని మళ్లించి పంటచేలను కాపాడాలని రైతులు అడపా దుర్గాప్రసాద్, జుత్తుగ శ్రీనివాస్, తుట్టపు బులిసత్యం, మేడిశెట్టి అన్నవరం తదితర రైతులు కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



మాచర, నాగులచెరువు ఆయకట్టు పరిధిలో సాగునీరందక బీటలువారిన చేలు



కొత్తపేటలో పట్టభద్రులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, పరిశీలకుడు గణేష్



కె.గంగవరం మండలం దంగేరు సభలో మాట్లాడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు గన్ని కృష్ణ

ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తులకు మద్దతుగా ప్రచారం

ఆలమూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లా పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు మద్దతుగా బుధవారం కూటమి నాయకులు ప్రచారం చేశారు. ఆలమూరు మండలంలోని పలు గ్రామాలలో కూటమి నాయకులు ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ను గెలిపించాలని ప్రచారం చేశారు. ఆలమూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ వక్కపట్ల లక్ష్మణరావు అధ్వర్యంలో ఓటర్లను అభ్యర్థించారు.

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌కు పట్టభద్రులు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు కోరారు. బుధవారం కొత్తపేటలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలోను, బార్ అసోషియేషన్‌లోను పట్టభద్రులను కలిసి ఓట్లను అభ్యర్థించారు. కార్యక్రమంలో కె. శ్రీనివాస్, బూసి జయలక్ష్మి, బూసి భాస్కరరావు, పాలూరి సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

కె.గంగవరం(ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల నియోజకవర్గం ఓటర్ల వద్దకు వెళ్లి కూటమి నాయకులు ఓట్లు అభ్యర్థించాలని టీడీపీ సీనియర్ నాయకుడు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు గన్ని కృష్ణ అన్నారు. బుధవారం దంగేరు గ్రామంలో మాజీ సర్పంచ్ రావిపాటి వెంకట గణేష్ చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ఆయన మాట్లాడారు. టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, కొత్తపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాసులు గంగవరంలో ఎన్నికల ప్రచారం చేశారు. తహశీల్దార్ కార్యాలయం, ఉన్నత పాఠశాలలకు వెళ్లి పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మరివాడ చిన్ని కృష్ణ, బి.శివప్రసాద్, జగతా రమణ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న కూటమి నాయకుడు వెంకన్న

సత్యవాడలో వేగంగా సీసీ రోడ్డు పనులు

కె.గంగవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సత్యవాడ గ్రామంలో సీసీ రోడ్డు పనులు వేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో గత ప్రభుత్వం సీసీ రోడ్ల నిర్మాణంలో నిర్లక్ష్యం వహించింది. దీనితో ఐదేళ్లుగా రహదారుల అభివృద్ధి జరగలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టిపెట్టింది. సత్యవాడ గ్రామంలో 15 రోడ్ల నిర్మాణానికి రూ.54 లక్షలు మంజూరవగా వాటి పనులు వేగంగా జరుగుతున్నాయి. కూటమి నాయకులు తోట వెంకన్న, సలాది బ్రహ్మయ్య, చినబాబు నిర్మాణ పనులు పర్యవేక్షిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ గ్రామంలో రోడ్ల సమస్య పరిష్కారం అయ్యిందని వారన్నారు.

ప్రజలకిచ్చిన హామీలను అమలుచేయాలి

మాజీ ఎంపీ హర్షకుమార్

మండపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చాడని అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ ఆరోపించారు. ఈసారి జరుగుతున్న గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల ఓటమి తథ్యమని అన్నారు. మండపేటలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తన తనయుడు సుందర్ పోటీ చేస్తున్నాడని తెలిపారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయని ఆయన ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలు అసంతృప్తితో వున్నారన్నారు. ఉభయగోదావరి జిల్లాల నుంచి పోటీ చేస్తున్న తన తనయుడు సుందర్‌ను గెలిపించాలని ఆయన కోరారు. సమావేశంలో స్థానిక నాయకులు యండ్ల రాజేష్, గంటా భాస్కరరావు, వి.సూర్యప్రకాష్, నల్లా దేవరాజ్, డి.అనంతలక్ష్మి, వై.రామకృష్ణ, జయబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎంపీ హర్షకుమార్



కొత్తపేట మండలం వాడపాలెంలో ఛత్రపతి శివాజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యానందం తదితరులు

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

కొత్తపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ధర్మసూత్రం ఫౌండేషన్ చోడిశెట్టి సురేష్ కుమార్, సింగిరెడ్డి గోవిందస్వామి ఆధ్వర్యంలో జరిపారు. ముందుగా వాడపాలెం నుంచి బైక్ ర్యాలీ జరిపి స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలకు, ఛత్రపతి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం మాట్లాడారు. కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్‌లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి జయంతిని నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు సంపతి కనకేశ్వరరావు, పాలూరి జయప్రకాష్ నారాయణ, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మండపేట(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. మండపేట సంఘం కాలనీ ఎంపీపీ పాఠశాలలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. బీజేపీ పట్టణ యువమోర్చా నాయకుల ఆధ్వర్యంలో శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. ద్వారపూడి వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ జయంతిని జరిపారు. ద్వారపూడి హైస్కూల్లో శివాజీ జయంతిని నిర్వహించి, దేశానికి ఆయన చేసిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు.

శివాజీ శోభాయాత్ర

ద్రాక్షారామ(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకుని చైతన్య రథంపై శివాజీ శోభాయాత్ర జరిపారు. రామచంద్రపురం పట్టణం, ద్రాక్షారామలో శోభాయాత్ర జరిగింది. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, విశ్వహిందూ పరిషత్ యువజన విభాగం, భజరంగ్‌దళ్ కాకినాడ జిల్లా అధ్యక్షుడు తోట రామకృష్ణ, హైందవ సమాజం సభ్యులు పాల్గొన్నారు.



బేతస్థ ప్రార్థనా మందిరం వార్షికోత్సవంలో పాల్గొన్న సంఘీయులు

ఘనంగా బేతస్థ ప్రార్థనా మందిర వార్షికోత్సవం

మండపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి వెనకవున్న బేతస్థ ప్రార్థనా మందిరం 28వ వార్షికోత్సవాన్ని బుధవారం సంఘ కాపరి బిషప్ రెవరెండ్ చిలుకూరి ఉదయ భాస్కర్ అధ్యక్షతన జరిగింది. దైవజనులు ఉదయ భాస్కర్ తన సందేశాన్ని అందజేశారు. దేవుడు చేసిన మేలుకు రుణపడి ఉంటూ కృతజ్ఞతలు చెల్లించాలని తెలిపారు. అనంతరం మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు బేతస్థ సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

కపిలేశ్వరపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర, ఇనుప వంతెన వద్ద కొలువైయున్న శ్రీ భక్తాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి పంచామృతాభిషేకం, తమలపాకులు, గంధ సింధూర పూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. ఆలయ వార్షికోత్సవం ముగింపును పురస్కరించుకుని బుధవారం ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక గ్రామస్థులతో పాటు పరిసర గ్రామాలకు చెందిన భక్తులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఎక్కడా ఇబ్బందులు రాకుండా నిర్వాహకులు అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు.

రెండో రోజు కొనసాగిన అంగన్‌వాడీల శిక్షణ



అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

రాయవరం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న ఆరురోజుల శిక్షణలో భాగంగా రెండవ రోజు బుధవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో వై.సూర్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు శిక్షణ ద్వారా మరింత మెరుగైన బోధన చేసేందుకు దోహదపడుతుందన్నారు. అనంతరం అంగన్‌వాడీ కార్యకర్తలకు టీఎల్ఎం తయారీ, బోధన అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో డీఆర్పీలు, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామ సప్తాహం

ఆలమూరు, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఆలమూరు మండలం పినపళ్లలో శ్రీరామ సప్తాహం బుధవారం ప్రారంభమైంది. ఈనెల 19వ తేదీ నుంచి 26 వరకు ఈ సప్తాహం సాగుతుంది. ఉదయం కలశ స్థాపనతో వేకువజామున ప్రారంభమైన సప్తాహ మహోత్సవం మొదటి రోజు తోరాటి రుద్రయ్య దంపతులచే ప్రత్యేక చేసిన భజన కార్యక్రమం ప్రారంభించారు. సప్తాహంలో భజనలు చేయడానికి పినపళ్లతోపాటు పలు గ్రామాల నుంచి భక్త మండలి గ్రూపులు రానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సప్తాహం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకుని తరించాలని కోరారు.



ఇరిగేషన్ అధికారులతో సాగునీటి ఎద్దడిపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రబీసాగుకు నీటి ఎద్దడి రానివ్వద్దు : ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి) రబీసాగుకు సాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. మండపేట టీడీపీ కార్యాలయంలో బుధవారం ఇరిగేషన్ అధికారులతో ఆయన సమావేశం జరిపారు. రైతులకు సాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటామని ఇరిగేషన్ ఇన్‌చార్జి ఈఈ రామకృష్ణ, రామచంద్రపురం ఇరిగేషన్ డీఈఈ రమేష్ తెలిపారు. రెండు రోజుల్లో రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించకుంటే శుక్రవారం కలెక్టర్‌కు ఇరిగేషన్ అధికారులపై ఫిర్యాదు చేస్తానని ఆయన అన్నారు. సమావేశంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, పలువురు రైతులు పాల్గొన్నారు.

రామచంద్రపురం చేరుకున్న పర్యావరణ పరిరక్షణ సైకిల్ యాత్ర

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ పరిరక్షణకు తమిళనాడు కోయంబత్తూర్‌కు చెందిన ముత్తు సెల్వన్ చేపట్టిన ఆసియా దేశాల సైకిల్ యాత్ర బుధవారం రామచంద్రపురం చేరుకుంది. పర్యావరణ పరిరక్షణ ధ్యేయంగా 10 లక్షల మొక్కలు నాటాలని లక్ష్యంగా ఈయన 28 డిసెంబరు 2021న సైకిల్‌యాత్ర ప్రారంభించారు. పది లక్షల మొక్కలు నాటాలని చేపట్టిన సైకిల్ యాత్ర అయిదేళ్లపాటు సాగుతుందన్నారు. ఇండియా, నేపాల్, బంగ్లాదేశ్, వియత్నాం, మయన్మార్, బ్యాంకాక్, థాయిలాండ్ తదితర దేశాల మీదుగా ప్రయాణించి 27 డిసెంబరు 2027 నాటికి ఢిల్లీలో ప్రధాని మోదీ సమక్షంలో యాత్ర ముగిస్తుందని తెలిపారు. ఇప్పటివరకు 7,14,300 మొక్కలు నాటినట్లు తెలిపారు. ఇంకా 2 లక్షల 27 వేల మొక్కలు నాటాల్సి ఉందన్నారు. ఇప్పటి వరకు 29,650 కిలోమీటర్లు సైకిల్ యాత్ర చేశానని మరో 14 వేల కిలోమీటర్లు సైకిల్‌యాత్ర చేయాల్సి ఉందన్నారు. రామచంద్రపురం చేరుకున్న ఆయనకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఛైర్మన్ వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులు స్వాగతం పలికారు. ఆయనకు వారు అభినందనలు తెలిపారు.

కొబ్బరి బొండాల వ్యాపారిపై దారికాచి దోపిడీ

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం వెల్ల గ్రామానికి చెందిన కొబ్బరి బొండాల వ్యాపారిపై ఇద్దరు యువకులు దారికాచి దోపిడీకి పాల్పడిన సంఘటనపై ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు వివరాలు ఇలా ఉన్నాయి. వెల్ల గ్రామానికి చెందిన లంక త్రిమూర్తులు రామచంద్రపురంలో కొబ్బరి బొండాలు విక్రయిస్తుంటాడు. మంగళవారం రాత్రి 8 గంటల ప్రాంతంలో వ్యాపారం ముగించుకుని మోటారు సైకిల్‌పై వెల్ల స్వగ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో రామచంద్రపురానికి చెందిన రాగిరెడ్డి సాయి, మరొక వ్యక్తి త్రిమూర్తులు మోటారు సైకిల్‌కు అడ్డుగా బైక్ పెట్టి గొడవకు దిగారు. మోటారు సైకిల్‌పై ఎక్కించుకుని వెల్ల ఏరుపల్లి మధ్యలో లేఅవుట్ ప్రాంతానికి తీసుకువెళ్లి దాడి చేశారు. అతని వద్ద ఉన్న రూ.1500 లాక్కుని వెళ్లిపోయారు. తన సోదరుడికి ఫోన్‌లో సమాచారం చెప్పారు. తదుపరి రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి నుంచి 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే పోలీసులు గాలింపు చేపట్టారు. నిందితుల్లో ఒకరైన సాయిని పట్టుకున్నారు. ద్రాక్షారామ ఎస్ఐ ఎం.లక్ష్మణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తిరుమల చేరుకున్న మంత్రి సుభాష్ అభిమాని

ద్రాక్షారామ, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): మంత్రి సుభాష్ అభిమాని రంకిరెడ్డి మణికంఠ 17 రోజులపాటు పాదయాత్ర చేసి తిరుమల చేరుకుని మొక్కు చెల్లించుకున్నారు. కె.గంగవరం మండలం సుందరపల్లికు చెందిన మణికంఠ గత సార్వత్రిక ఎన్నికల్లో సుభాష్ గెలుపొందితే తిరుమలకు కాలినడకన చేరుకుని స్వామిని దర్శించుకుంటానని మొక్కుకున్నారు. ఎన్నికల్లో ఆయన విజయం సాధించడంతో మణికంఠ ఈనెల 3వ కె.గంగవరం మండలం సుందరపల్లి నుంచి పాదయాత్రగా తిరుమల బయలుదేరారు. 17 రోజుల పాటు పాదయాత్ర చేసి బుధవారం తిరుమలకు చేరుకున్నారు. మంత్రి సుభాష్ కూడా సమయానికి తిరుమలకు వెళ్లడంతో ఆయనతో కలసి మణికంఠ కుటుంబ సభ్యులు వెంకటేశ్వరస్వామిని దర్శించుకుని మొక్కు చెల్లించుకున్నారు.

ఘనంగా విశ్వనాథ్ జయంతి

ఆత్రేయపురం, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ర్యాలీ అనూష్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కళాతపస్వి కె.విశ్వనాథ్ అభిమాని ఎం.కుమార్‌రాజా ఆధ్వర్యంలో బుధవారం విశ్వనాథ్ జయంతిని నిర్వహించారు. ముఖ్య అతిథిగా రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్ చేతుల మీదుగా కె.విశ్వనాథ్ స్మారక కళాసేవా పురస్కారాలను 11 మందికి ప్రదానం చేశారు. సేవా, కళారంగాలలో సేవలు అందించిన వారికి ఈ పురస్కారాలను అందచేశారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్ట్ మోహిత్‌కృష్ణ, ఎస్వీ గురుస్వామి, శ్యామ్‌జాదుగార్ తదితరులు పాల్గొన్నారు.